


రంజాన్ వేళలు

	ఇఫ్తార్	సెహరి
	సోమవారం	మంగళవారం
కర్నూలు	6: 31	5: 13
నంద్యాల	6: 28	5: 12

కంది రైతు కన్నీరు





ఈ రైతు పేరు వెంకటేశ్వరరెడ్డి. డోన్ మండలం రామదుర్గం నివాసి. డోన్ మార్కెట్ యార్డులోని డీసీఎంఎస్ కొనుగోలు కేంద్రానికి 15 సంచుల్లో కందులను అమ్మకానికి తీసుకువచ్చాడు. ఆటో ఖర్చులతోపాటు, హమాలీలకు ఒక సంచికి రూ.300 చొప్పున చెల్లించాడు. ఇంత వ్యయ ప్రయాసలకోర్చి కందులు తీసుకొచ్చాడు. అయితే.. కేంద్ర గిడ్డంగుల సంస్థ అధికారులు కందులు నాణ్యంగా లేవన్నారు. మరోదారి లేక రైతు కందులు వెనక్కి తీసుకువచ్చి శుభ్రం చేసి కొనుగోలు కేంద్రానికి అప్పగించాడు. దీని వల్ల రైతుకు రెట్టింపు ఖర్చు అయింది. మార్క్‌ఫెడ్ అధికారులు మద్దతు ధర చెల్లించినా రవాణా ఖర్చులు పెరిగిపోయి కనీసం గిట్టుబాటు కాలేదని రైతు వెంకటేశ్వరరెడ్డి కన్నీటి పర్యంతమయ్యాడు. ఉమ్మడి జిల్లాలో డీసీఎంఎస్ కొనుగోలు కేంద్రాలకు కందులు అమ్మడానికి తీసుకెళ్తున్న వందలాది మంది రైతుల దుస్థితి ఇది.

- పంట దిగుబడి నాణ్యంగా లేదని వెనక్కి పంపుతున్న సీడబ్ల్యూసీ అధికారులు
- దళారులే నయమంటున్న రైతులు
- మార్కెట్ యార్డులో అమ్ముకుంటున్న వైనం

3లక్షల ఎకరాల్లో కంది పంట సాగు

కర్నూలు అగ్రికల్చర్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): బహిరంగ మార్కెట్‌లో క్వింటం కందులకు మద్దతు ధర రూ.6వేల నుంచి రూ.7వేలు మాత్రమే. కేంద్ర ప్రభుత్వం క్వింటం ధర రూ.7,550 నిర్ణయించింది. ప్రకృతి వైపరీత్యాల వల్ల కంది పంట ఖరీఫ్‌లో పూర్తిగా దెబ్బతిన్నది. ఎకరాకు 10 క్వింటాళ్ల దిగుబడి రావాల్సి ఉండగా.. కేవలం నాలుగు క్వింటాళ్లు మాత్రమే వచ్చాయి. కనీసం ఈ మాత్రం పంట దిగుబడినైనా మార్క్‌ఫెడ్ సంస్థకు విక్రయించి మద్దతు ధర పొందాలని ఉమ్మడి జిల్లా రైతులు ఆశించారు. అయితే మార్క్‌ఫెడ్ అధికారులు రైతుల నుంచి కందులు కొనుగోలు చేస్తున్నా గోదాముల్లో వాటిని నిల్వ చేసేందుకు సీడబ్ల్యూసీ అధికారులు కొర్రీల మీద కొర్రీలు వేస్తూ రైతులను వెనక్కి పంపిస్తున్నారు. దీంతో వాళ్లకు దిక్కుతోచడం లేదు. రైతుల బాధ చూడలేకపోతున్నామని మార్క్‌ఫెడ్ అదికారులు, డీసీఎంఎస్ కేంద్రాల సిబ్బంది అంటున్నారు. కందులను కొనుగోలు చేసినా గోదాముల్లో నిల్వ చేసేందుకు సెంట్రల్ వేర్ హౌస్ అధికారులు పర్మిషన్ ఇవ్వకపోవడంతో రైతులు తిరిగి కందులను వెనక్కి తీసుకపోతున్నారు. రైతులకు ఇది ఆర్థికంగా మరింత భారమవుతున్నది. శ్రమ అవుతున్నది. అందుకని చాలా మంది రైతులు మరోదారి లేక కర్నూలు మార్కెట్ యార్డులో తక్కువ ధరకే దళారులకు పంట దిగుబడి పెడుతున్నారు. సీడబ్ల్యూసీ అధికారులు నాణ్యత నిబంధనలు చూపుతూ తమకు అన్యాయం చేస్తుండటంతో తమకు దళారులే దిక్కు అవుతున్నారని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



కర్నూలు యార్డుకు విక్రయానికి తెచ్చిన కందులు

ఖరీఫ్‌లో రైతులు పండించిన కందులను చివరి గింజ దాకా మద్దతు ధర రూ.7,550 కొంటామని కేంద్ర సంస్థ నాఫెడ్‌తో పాటు రాష్ట్ర సంస్థ మార్క్‌ఫెడ్ ఉన్నతాధికారులు ప్రకటించారు. ఎకరాకు పది క్వింటాళ్ల దిగుబడి రావాల్సి ఉండగా.. కేవలం 4 క్వింటాళ్లు మాత్రమే చేతికందడంతో రైతులు నష్టానికి గురయ్యారు. మార్క్‌ఫెడ్ అధికారుల హామీతో దిగుబడి తగ్గినా మద్దతు ధర అయినా అందుతుందనే ఆశతో ఉమ్మడి కర్నూలు జిల్లా రైతులు వ్యయప్రయాసల కోర్చి డీసీఎంఎస్ కొనుగోలు కేంద్రాలకు కందులు తీసుకొచ్చారు. మొదట్లో మార్క్‌ఫెడ్ సంస్థ ద్వారా కర్నూలు జిల్లాలో 56వేల టన్నులు, నంద్యాల జిల్లాలో 44వేల టన్నులు కొంటామని మూడు నెలలకిందటే అధికారులు ప్రకటించారు. ఇప్పటికీ ఇదిగో.. అదిగో అంటూ ఫిబ్రవరిలో రైతుల నుంచి కందులు కొనడానికి డీసీఎంస్ ద్వారా కేంద్రాలను ఏర్పాటు చేశారు. మిగతా 7వ పేజీలో

నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

కర్నూలు కలెక్టరేట్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): కర్నూలు కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా ప్రజల నుంచి వినతులు స్వీకరించనున్నట్లు కలెక్టర్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంతో పాటు అన్ని మండల కేంద్రాల్లో మున్సిపల్ కార్యాలయాల్లో, డివిజన్ స్థాయిలో కూడా ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు.

ఈక్రాప్ ఈకేవైసీకి నేడే చివరి తేదీ

కర్నూలు అగ్రికల్చర్, మార్చి 2(ఆంధ్రజ్యోతి): రబీ పంటలకు సంబంధించి ఈక్రాప్ ఈకేవైసీ నమోదుకు ప్రభుత్వం ఈ నెల 3వ తేదీ సోమవారం వరకు అవకాశం కల్పించిందని వ్యవసాయ శాఖ జేడీ జయలక్ష్మి తెలిపారు. ఈక్రాప్ నమోదుతో పాటు ఈకేవైసీలో ప్రస్తుత రబీలో సాగైన పంటలకు సంబంధించి 98 శాతం విస్తీర్ణంలో నమోదు చేశామన్నారు. ఈ కార్యక్రమాల్లో రైతులు పంటలను సాగు చేసుకుంటేనే పంటల బీమా ద్వారా లబ్ధి పొందే అవకాశం ఉందని అన్నారు. అదేవిధంగా సున్నా వడ్డీతో పాటు రైతుభరోసా తదితర పథకాల ద్వారా లబ్ధి పొందవచ్చుని, రైతులంతా ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు.

ఉపవాస దీక్షలు ప్రారంభం



కర్నూలు కల్చరల్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): పవిత్ర రంజాన్ మాసాన్ని ఉమ్మడి జిల్లాలోని ముస్లింలు ఆదివారం భక్తిశ్రద్ధలతో ప్రారంభించారు. తొలి రోజు నుంచే ఉపవాసం రోజా దీక్షలు మొదలు పెట్టారు. సంప్రదాయబద్ధంగా ఉదయం సహేర్‌తో రోజా దీక్షలను ప్రారంభించారు. సుమారు 14 గంటల పాటు ఉపవాసం పాటించి సాయంత్రం ఇఫ్తార్ సమయంలో రోజా దీక్షను విరమించారు. అనంతరం ప్రత్యేక నమాజ్ ఆచరించారు. రంజాన్ నెల ప్రారంభ సందడి కర్నూలు నగరంలో బాగా కనిపించింది. ప్రధానంగా పాతనగరంలోని మార్కెట్లు తినుబండారాల కొనుగోళ్లతో రద్దీగా కనిపించాయి. ఈ మాసంలో నెల రోజుల పాటు రోజా పాటించే వారికి అందుబాటులో విభిన్న రకాల పండ్లు మార్కెట్లో అందుబాటులో ఉంటున్నాయి. సాయంత్రం ఇఫ్తార్ వేళ నగరంలోని పెద్దమార్కెట్, చిన్న మార్కెట్ సి.క్యాంపు, నంద్యాల చెక్‌పోస్టు తదితర ప్రాంతాల్లో ఇఫ్తార్ విందుకు సంబంధించిన అనేక తినుబండారాలను విక్రయాలకు పెట్టారు. అలాగే మసీదుల ప్రాంతాల్లోనూ ఇఫ్తార్‌కు సంబంధించిన ఖర్జూర ఫలాలు, పండ్లు వంటివి అమ్మకాలకు పెట్టారు. రంజాన్ ఉపవాసం విరమణకు అవసరమయ్యే ఫలాలకు ముస్లింలు పెద్ద సంఖ్యలో హాజరై వాటిని కొనుగోళ్లు చేయడం కానవచ్చింది. అలాగే మసీదులతోపాటూ వివిధ ప్రాంతాల్లో ఇఫ్తార్ విందును సంప్రదాయబద్ధంగా స్వీకరించారు.

అన్నపూర్ణమ్మ సేవలు స్ఫూర్తిదాయకం

జిల్లా ప్రధాన న్యాయాధికారి కబర్ది



ప్రసంగిస్తున్న జిల్లా ప్రధాన న్యాయాధికారి కబర్ది

కర్నూలు కల్చరల్, మార్చి 2(ఆంధ్రజ్యోతి): కర్నూలులో 30 ఏళ్లుగా అన్నపూర్ణమ్మ విద్యార్థి వసతి గృహం అందిస్తున్న సేవలు స్ఫూర్తిదాయకంగా నిలుస్తున్నాయని జిల్లా ప్రధాన న్యాయాధికారి కబర్ది అన్నారు. ఆదివారం రాత్రి పాతనగరంలోని స్వామి వివేకానంద పాఠశాల ఆవరణలో అన్నపూర్ణమ్మ విద్యార్థి వసతి గృహం 31వ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన జిల్లా ప్రధాన న్యాయాధికారి తొలుత భరతమాత విగ్రహానికి పూజలు చేసి, జ్యోతిప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్నపూర్ణమ్మ ఆవాసంలో విద్యార్థులకు చదువు, సంస్కారం ఒకేసారి అందుతున్నాయని చెప్పారు. ప్రైవేటు పాఠశాలల్లో చదువుకే ప్రాధాన్యత ఇస్తున్నారని, విద్యార్థులకు సంస్కారం కూడా ఎంతో అవసరమని అన్నారు. వసతి గృహ అధ్యక్ష, కార్యదర్శులు బి. చిరంజీవిరెడ్డి, కె. బాలాజీరావు మాట్లాడుతూ నగరంలోని చిదంబరరావు వీధిలో గడిచిన 31 ఏళ్లుగా అందరి ఆదరాభిమానాలతో, సహాయ సహకారాలతో నిరుపేద బాలుర కోసం అన్నపూర్ణమ్మ విద్యార్థి వసతి గృహం నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమానికి ప్రముఖ పారిశ్రామికవేత్త శేరి బాల నాగరాజు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా సేవా భారతి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పలు సేవా కార్యక్రమాలను ఆర్‌ఎస్ఎస్ విభాగ్ కార్యకారిణి సభ్యుడు సుబ్బలక్ష్మయ్య వివరించారు. ఆర్‌ఎస్ఎస్ క్షేత్ర సేవా ప్రముఖ్ ఎక్కం చంద్రశేఖర్, విశ్వనాథ్ పాల్గొన్నారు. సందర్భంగా బాలలు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు, దేశభక్తి గీతాలు ఆకట్టుకున్నాయి.

బలరాముడు

185 కేజీల గుండును అవలీలగా ఎత్తిన కర్ణాటకవాసి



185 కేజీల రాతి గుండును ఎత్తిన దశరథరాముడు

పెద్దకడుబూరు, మార్చి 2(ఆంధ్రజ్యోతి): పేరు దశరథరాముడే అయినా రాతి గుండు ఎత్తే పోటీల్లో బలరాముడు అనిపించుకున్నాడు. 185 కేజీల గుండును అవలీలగా ఎత్తి శభాష్ అనిపించుకున్నాడు. పెద్దకడుబూరులో శ్రీసిద్ధారుడ స్వామి జాతరను పురస్కరించుకొని గుండు ఎత్తుడు పోటీలు నిర్వహించారు. ఆంధ్రా, కర్ణాటక ప్రాంతాల నుంచి పోటీల్లో పాల్గొనేందుకు యువకులు వచ్చారు. వీరిలో కర్ణాటక రాష్ట్రం బీజాపూర్ తాలుకా యర్రవల్లి గ్రామానికి చెందిన దశరథ రాముడు మొదటగా 150 కేజీల బరువు ఎత్తాడు. అలాగే రెండోసారి 178 కేజీలు, మూడోసారి 185 కేజీల గజ్జల గుండును ఎత్తి మొదటి బహుమతి 15 తులాల వెండిని కైవసం చేసుకున్నాడు. అలాగే కర్ణాటక రాష్ట్రం మాన్వి తాలుకా కప్పగల్లుకు చెందిన కర్ల 150 కేజీలు, 178 కేజీల గుండును ఎత్తి ద్వితీయ బహుమతి 10 తులాల వెండిని గెలుచుకున్నాడు. ఈ పోటీలను తిలకించేందుకు ఆయా గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరయ్యారు. కార్యక్రమంలో నిర్వాహకులు రామ్మోహన్‌రెడ్డి, రామలింగారెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, రఘురామ్, సర్పంచ్ రామాంజనేయులు, ఒడ్డు దస్తగిరి, శాంతిమూర్తి, రామాంజిని, నీలకంఠప్పలు పాల్గొన్నారు.

జయహో గురు రాఘవేంద్రా
- రాఘవరాయలకు విశేష పంచామృతాభిషేకం
- బంగారు కవచంతో సుందరీకరణ

7

మూడు రోజులుగా మృత్యువుతో పోరాడి..





రోదిస్తున్న తల్లిదండ్రులు దస్తగిరి, శిరీష



శ్రీలేఖ (ఫైల్)

- చికిత్స పొందుతూ మృతి చెందిన విద్యార్థిని శ్రీలేఖ
- కన్నీరుమున్నీరైన విద్యార్థిని తల్లిదండ్రులు
- రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించిన ప్రభుత్వం

కర్నూలు హాస్పిటల్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): సి.బెళగల్ మండలం పోలకల్ జిల్లా పరిషత్ హైస్కూల్‌లో 8వ తరగతి చదువుతున్న విద్యార్థిని శ్రీలేఖ (14) ఆదివారం మృతి చెందింది. పాఠశాలలో సైన్స్‌డే నిర్వహిస్తుండగా శుక్రవారం చెట్టువిరిగి పడి తీవ్రంగా గాయపడిన విషయం తెలిసిందే. దీంతో కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు తరలించారు. ఆర్‌ఐసీయూలో చికిత్స అందిస్తుండగా ఆదివారం కార్డియాక్ అరెస్టు కావడంతో మృతి చెందింది.

కోలుకుందని అనుకున్న తరుణంలో..

విద్యార్థిని కోలుకోవడంతో క్యాజువాల్టీ నుంచి ఆర్‌ఐసీయూకు పంపించి చికిత్స అందించారు. శనివారం ఉదయం కలెక్టర్ రంజిత్ బాషా, కోడుమూరు ఎమ్మెల్యే దస్తగిరి విద్యార్థిని పరామర్శించారు. అయితే తెల్లవారుజామున విద్యార్థిని ఆరోగ్య పరిస్థితి విషమించింది. ఉదయం కార్డియాక్ అరెస్టుతో మృతి చెందినట్లు వైద్యులు ప్రకటించారు. మృతి చెందిన బాలిక ఊరు గోనెగండ్ల మండలం పెద్దనేలటూరు గ్రామం. తల్లిదండ్రులు పోగుల దస్తగిరి, శిరీష దంపతులకు ముగ్గురు పిల్లలు. పెద్దమ్మాయి శ్రీలేఖ పోలకల్‌తో చదువుతోంది. కుమారుడు సాయికృష్ణ పాణ్యంలో చదువుకుంటున్నాడు. చిన్న కూతురు ధరణి పెద్దనేలటూరులో నానమ్మ వద్ద చదువుకుంటోంది. శ్రీలేఖ తల్లిదండ్రులు వ్యవసాయ కూలీ పని చేస్తూ జీవిస్తున్నారు. తరుచూ హైదరాబాదు, గుంటూరుకు వలస వెళ్తుంటారు. పిల్లలను అమ్మమ్మ, నానమ్మల దగ్గర ఉంచి సుగ్గికి వెళ్తుంటారు. పెద్దమ్మాయి శ్రీలేఖకు కూడా అమ్మమ్మ దస్తగిరమ్మ దగ్గర పోలకల్‌లో వదిలి వెళ్లారు.

'ఎక్కడున్నావమ్మా.. ఇంటికెళ్లాం లేవమ్మా శ్రీలేఖ.. నా పెద్ద కూతురా.. బాగుంది.. బాగుంది అన్నారే డాక్టర్లు.. మరీ ఏమైంది.. శనివారం ఉదయం బాగానే మాట్లాడావే.. ఎక్కడికి పోయినావే నా బిడ్డ ఇక లేవమ్మా... ఇక నిన్ను వదిలి సుగ్గికి వెళ్లనమ్మా.. లేవమ్మా.. మన ఊరికి పోదామంటూ' మృతి చెందిన బాలిక శ్రీలేఖ మృతదేహం మీద పడి తల్లి కన్నీరు మున్నీరై విలపించింది.

రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా

శ్రీలేఖ కుటుంబానికి ప్రభుత్వం రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించిందని కలెక్టర్ రంజిత్ బాషా ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇలాంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా గట్టి చర్యలు తీసుకోవాలని విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. మార్చురీ వద్దకు చేరుకున్న డీఈవో శ్యామ్యూల్‌పాల్ బాలిక తల్లిదండ్రులుకు ధైర్యం చెప్పారు. రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియాతో పాటు ఇద్దరు పిల్లలకు గురుకుల పాఠశాలలో చదువు కొనసాగించేలా చేస్తామని కలెక్టర్ హామీ ఇచ్చినట్లు వెల్లడించారు.

విద్యార్థిని పాడె మోసిన డీఈవో

శ్రీలేఖ తుది శ్వాస వదలడంతో డీఈవో ఎస్.శ్యామ్యూల్‌పాల్ తీవ్ర భావోద్వేగానికి లోనయ్యారు. ఆదివారం పోస్టుమార్టం గది వద్దకు చేరుకొని బాలిక తల్లిదండ్రులకు ధైర్యం చెప్పారు. అనంతరం బాలిక స్వగ్రామమైన గోనెగండ్ల మండలం పెద్దనేలటూరుకు వెళ్లిన డీఈవో అంత్యక్రియల్లో పాల్గొని పాడే మోసి నివాళులర్పించారు. అంత్యక్రియలకు రూ.20 వేల ఆర్థిక సాయం అందించారు.



పాడె మోస్తున్న డీఈవో శ్యామ్యూల్‌పాల్



రోదిస్తున్న తల్లిదండ్రులు, బంధువులు

జయహో గురు రాఘవేంద్రా

- రాఘవరాయలకు విశేష పంచామృతాభిషేకం
- బంగారు కవచంతో సుందరీకరణ
- భక్తులతో మార్మోగిన మంత్రాలయం



బంగారు పల్లకిలో ఊరేగుతున్న రాఘవేంద్రులు

మంత్రాలయం, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): రాఘవేంద్ర స్వామి గురువైభోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. రెండో రోజు ఆదివారం మఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థుల ఆధ్వర్యంలో రాఘవేంద్రస్వామి మూల బృందావనానికి విశేష పంచామృతాభిషేకం నిర్వహించి బంగారు కవచం, వెండి వివిధ రకాల పుష్పాలతో అలంకరించి హారతులు ఇచ్చారు. అంతకు ముందు పూర్ణబోధ పూజా మందిరంలో పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు, మూలరాములు, జయరాములు, దిగ్విజయరాములకు సంస్థాన పూజ చేసి హారతులు ఇచ్చారు. దేశ నలుమూలల నుంచి వచ్చిన భక్తులు పీఠాధిపతి స్వహస్తాలతో చేసిన పూజలను కనులారా తిలకించి మంత్రముగ్ధులయ్యారు. ఉత్సవమూర్తి ప్రహ్లాదరాయలకు పాద పూజ చేసి చెక్క, వెండి, రజిత గజ వాహనం, బంగారు, నవరత్నాల రథాలపై అంగరంగ వైభవంగా ఊరేగించారు. అనంతరం బంగారు పల్లకిలో స్వామివారిని బృందావన ప్రతిమను అధిష్ఠించి వైభవంగా ఊరేగించారు. రాఘవేంద్ర నమోఃనమః అంటూ అశేష భక్త జనవాహినితో మంత్రాలయం మార్మోగింది. పెద్ద సంఖ్యలో తరలివచ్చిన భక్తులకు పీఠాధిపతి శేషవస్త్రం, ఫలపుష్ప మంత్రాలక్షితలు పరిమళ ప్రసాదం ఇచ్చి ఆశీర్వదించారు. ఉత్సవాల్లో రెండో రోజు కేంద్ర రైల్వే శాఖ మంత్రి సోమన్న, టీటీడీ సభ్యులు నరేష్ కుమార్, ఆదోని సబ్ కలెక్టర్ మౌర్యభరద్వాజ్, డీఎస్పీ ఉపేంద్రబాబు, సీఐ రామాంజులు, ఎస్ఐ శివాంజల్, తహసీల్దార్ ఎస్.రవి, మండల సర్వేయర్ అశోక్, వీఆర్వోలు భీమన్నగౌడు, ఆనంద్, పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సంగీత కచేరి

గురు భక్తి ఉత్సవాల్లో భాగంగా రెండో రోజు ఆదివారం రాత్రి యోగీంద్ర కళా మండపంలో బెంగళూరుకు చెందిన విధూశ్రీ అదిపి నారాయణచే వోకల్ సంగీతం, బెంగళూరుకు చెందిన కడప హనుమేషాచార్‌చే వేణు సంగీతం దాసవాని సాహిత్యం భక్తులను ఆకట్టుకుంది. కళాకారులకు పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు నగదు, ఫలపుష్ప మంత్రాక్షితలు ఇచ్చి ఆశీర్వదించారు. కార్యక్రమంలో పండిత కేసరి రాష్ట్రపతి అవార్డు గ్రహీత విద్వాన్ రాజాఎస్ గిరిరాజాచార్, ఏఏవో మాధవశెట్టి, మఠం మేనేజర్లు వెంకటేశ్‌జోషి, శ్రీపతాచార్, సురేష్ కోనాపూర్, ఐపి నరసింహమూర్తి, వాధిరాజాచార్, ఆనందతీర్థాచార్, గౌతమాచార్, సుధీంద్రాచార్, ఏఈ బద్రినాథ్, సూపరింటెండెంట్లు అనంతపురాణిక్, విజయేంద్రాచార్, రవికులకర్ణి, జేపీస్వామి, వ్యాసారాజాచార్‌లు, డీఎం ఆనందరావు, ద్వారపాలక అనంతస్వామి, వాషేంద్రచార్, రమణారావు, తదితరులు పాల్గొన్నారు.

సంస్కృత విద్యకు అధిక ప్రాధాన్యం

పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు

దేశంలో సంస్కృత విద్యకు హిందూ ధర్మం, సంప్రదాయాలు, సంస్కృతిని కాపాడేందుకు సంస్కృత విద్యకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు మఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు అన్నారు. ఆదివారం ఉదయం నుంచి రాత్రి వరకు న్యాయసుధ పరీక్షలో శిక్షణ పొందిన ఎనిమిది మందికి పరీక్షలు నిర్వహించారు. వారికి వివిధ వేద విద్వాంసులు, పండితులు, వేద పాఠశాల అధ్యాపకుల మధ్య పరీక్ష కొనసాగించారు. ఎనిమిది మందిలో రుషికేష్, పురాణిక్ భద్రినాథ్, అభిషేక్ జోషీలు ఉత్తీర్ణులయ్యారు. మరో ఐదుగురికి మరో రెండు రోజులు పరీక్షలు కొనసాగుతాయని పీఠాధిపతి తెలిపారు. ఉత్తీర్ణులైన వారికి పరిమళ గ్రంథం పూర్తి చేసుకుని శ్రీమఠంలోనే శాశ్వత ఉద్యోగులుగా వారికి సకల సౌకర్యాలు కల్పిస్తామని తెలిపారు. కార్యక్రమంలో విద్వాన్‌పండిత కేసరి రాష్ట్రపతి అవార్డు గ్రహీత రాజాఎస్ గిరిరాజాచార్, రాజా ఎస్ అప్రమేయాచార్, కృష్ణ కౌశిక్, వాధిరాజాచార్, బండి శ్యామాచార్, పురోహిత్ నరసింహాచార్, వేణుగోపాల్ ఆచార్, రమేష్‌ఆచార్ పాల్గొన్నారు.



న్యాయసుధ పరీక్షలు నిర్వహిస్తున్న పీఠాధిపతి, రాజాఎస్‌గిరిరాజాచార్‌లు



రాఘవరాయల బృందావనానికి పూజలు చేస్తున్న పీఠాధిపతి

ప్రముఖులకు అవార్డులు



రైల్వే శాఖ మంత్రి సోమన్నకు అవార్డు అందజేస్తున్న పీఠాధిపతి

మంత్రాలయం రాఘవేంద్ర స్వామి గురు వైభవోత్సవాల్లో భాగంగా రెండో రోజు ఆదివారం రైల్వే శాఖ మంత్రి సోమన్న, టీటీడీ బోర్డు సభ్యులు నరేష్ కుమార్‌లకు ఊంజల మండపంలో అవార్డులు ప్రదానం చేశారు. అదే విధంగా ఆదివారం రాత్రి యోగీంద్ర కళా మండపంలో బెంగళూరు సీబీఐ కోర్టు జడ్జి జస్టిస్ హెచ్‌ఏ మోహన్, సువర్ణ టీవీ చానల్ ఎడిటర్ అజిత్, హనుమక్కనవర్, బెంగళూరు జిల్లా జడ్జి విజయ్‌దేవరాజ్, రాష్ట్ర ఆడిట్ ఫైనాన్స్ రీజనల్ డైరెక్టర్ గోవిందప్పలు రాఘవేంద్ర స్వామిని దర్శించుకుని అవార్డులు స్వీకరించారు. వీరికి వేర్వేరు సమయాల్లో ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, తహసీల్దార్ ఎస్.రవి, డీఎస్పీ ఉపేంద్ర బాబు, సీఐ రామాంజులు, ఎస్ఐ శివాంజల్ ఘనంగా స్వాగతం పలికారు. గ్రామ దేవత మంచాలమ్మను దర్శించుకుని రాఘవేంద్ర స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం యోగీంద్ర కళా మండపంలో పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు మెమెంటో, శేషవస్త్రం, ప్రశంసాపత్రం, వెండితట్ట, నగదు, ఫలపుష్ప మంత్రాక్షితలు ఇచ్చి ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో పండిత కేసరి రాజా ఎస్ గిరిరాజాచార్, ఆనందతీర్థాచార్, గౌతమాచార్, ఏఏవో మాధవశెట్టి, మఠం మేనేజర్లు వెంకటేష్ జోషి, సురేష్ కోనాపూర్, శ్రీపతాచార్, వాధిరాజాచార్, తదితరులు పాల్గొన్నారు.

త్వరలో వందే భారత్ స్లీపర్ రైలును పట్టాలెక్కిస్తాం

బెంగళూరు నుంచి గుల్బర్గా వరకు వందేభారత్ స్లీపర్ రైలును త్వరలో పట్టాలు ఎక్కిస్తామని కేంద్ర రైల్వేశాఖ మంత్రి సోమన్న అన్నారు. గురు వైభవోత్సవాల్లో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడారు. మంత్రాలయం మీదుగా వందేభారత్ రైలు సమయాలు అనుకూలంగా లేవని, భక్తుల నుంచి ఫిర్యాదులు, సలహాలు రావడంతో సమయ వేళలు మారుస్తామని తెలిపారు. ఈ అవార్డు రావడం పూర్వజన్మ సుకృతమన్నారు. కార్యక్రమంలో డీఆర్ఎం చంద్రశేఖర్ గుప్త, డీసీఎం మనోజ్, కుమారస్వామి, డీవోఎం, డీఎస్పీ, స్టేషన్ మాస్టర్ వాస్మిక్, చంద్రరాజ్, జాఫర్‌ఖాన్, కాశినాథ్‌లు పాల్గొన్నారు.



బెంగళూరు సీబీఐ కోర్టు జడ్జి మోహన్‌కు అవార్డు అందజేస్తున్న పీఠాధిపతి

జిల్లా స్థాయి జాతీయ సైన్స్‌డే వారోత్సవాలు

కర్నూలు ఎడ్యుకేషన్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): స్థానిక బీ క్యాంపులోని ఐఏఎస్‌ఈ కాలేజీలో జిల్లా స్థాయి జాతీయ సైన్స్ దినోత్సవం ఈ నెల 3, 4 తేదీల్లో నిర్వహిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి శ్యామ్యూల్ పాల్ ఆదివారం తెలిపారు. వికసిత్ భారత్‌లో భాగంగా సైన్స్, ఆవిష్కరణల్లో ప్రపంచ నాయకత్వం కోసం భారతీయ యువతకు సాధికారిత (ఎంపవరింగ్ ఇండియన్ యూత్ ఫర్ గ్లోబల్ లీడర్‌షిప్ ఇన్ సైన్స్ అండ్ ఇన్నోవేషన్ ఫర్ వికసిత్ భారత్) అంశంపై క్విజ్, సెమినార్ నిర్వహించి విజేతలైన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేస్తామన్నారు. ప్రాథమిక స్థాయి 1 నుంచి 8 తరగతుల విద్యార్థులకు, 9, 10 తరగతుల విద్యార్థులకు వేర్వేరుగా పోటీలు నిర్వహిస్తామి చెప్పారు. జిల్లా వ్యాప్తంగా అన్ని పాఠశాలల నుంచి ఆసక్తి కలిగిన విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొనేలా సైన్స్ ఉపాధ్యాయులు, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు చర్యలు తీసుకోవాలన్నారు. మీ పాఠశాలలో విద్యార్థుల పేర్లను ముందుగానే నమోదు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు జిల్లా సైన్స్ ఆఫీసర్ ఎస్.రంగమ్మ 8790111331 నెంబరును సంప్రదించాలని కోరారు.

ఎక్సైజ్‌శాఖ అధికారుల సంఘం

ఉమ్మడి జిల్లా అధ్యక్షుడిగా రాజేంద్రప్రసాద్



నియామక పత్రం అందుకుంటున్న రాజేంద్ర ప్రసాద్

కర్నూలు అర్బన్, మార్చి 2(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కర్నూలు జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ ఎగ్జిక్యూటివ్ అధికారుల సంఘం ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగాయి. ఆదివారం జిల్లా ఎక్సైజ్ శాఖ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఎన్నికల అధికారి మచ్చా సుధీర్ బాబు, అడిషనల్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఉమ్మడి జిల్లా అధ్యక్షుడిగా ఈఎస్‌టీఎఫ్ సీఐ రాజేంద్రప్రసాద్, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా ఎక్సైజ్ జోన్ సీఐ సోమశేఖర్, వైస్ ప్రెసిడెంట్‌గా ఎక్సైజ్‌శాఖ కోసిగి సీఐ పి.భార్గవరెడ్డి, జనరల్ సెక్రటరీగా ఎక్సైజ్ శాఖ ఎమ్మిగనూరు సీఐ ఎ.రమేష్‌రెడ్డి, జాయింట్ సెక్రటరీగా కర్నూలు ఎక్సైజ్ ఎస్ఐ రెహనా, ట్రెజరర్‌గా కర్నూలు ఎక్సైజ్ ఎస్ఐ దుర్గా నవీన్‌బాబు, ఈసీ మెంబర్లుగా ఎక్సైజ్‌శాఖ ఎస్ఐలు ఓ.శ్రీధర్, ఆర్‌జరమాదేవీ, ఎ.శేషాచలం, ప్రవీణ్‌కుమార్ నాయక్, ఇంద్రకిరణ్ తేజను ఎన్నుకున్నారు.

నీటిని మళ్లించడం అన్యాయం: ఎంపీ బస్తిపాటి



కర్నూలు అర్బన్, మార్చి 2(ఆంధ్రజ్యోతి): తుంగభద్ర దిగువ కాలువ నుంచి కర్నూలుకు వస్తున్న నీటిని కర్ణాటకలోని ఎర్రగుడి రిజర్వాయర్‌కు మళ్లించడం అన్యాయమని ఎంపీ బస్తిపాటి నాగరాజు అన్నారు. జలచౌర్యం పై టీబీ డ్యామ్ బోర్డు అధికారులలో ఆయన ఫోన్ ద్వారా మాట్లాడారు. అనుమతి లేకుండా కర్నూలుకు వచ్చే నీటిని పైపుల ద్వారా ఎలా మళ్లిస్తారని ప్రశ్నించారు. బళ్లారి రూరల్ ఎమ్మెల్యే నాగేంద్ర చెబితే అక్కడి అధికారులు నీటిని పైపుల ద్వారా దోపిడీ చేయడం ఏమిటని మండి పడ్డారు. నీటిని మళ్లించడం ద్వారా తమకు వేసవిలో తాగునీటి సమస్య వస్తుందని, ఆ సమస్యను ఎవరు తీరుస్తారని ప్రశ్నించారు. నీటి చౌర్యాన్ని అరికట్టాల్సిన అధికారులను ఆదేశించారు. ప్రస్తుత నీటి మళ్లింపు నిలిపి వేశారని అధికారులు చెప్పారు. మరో సారి దిగువ రావాల్సిన నీటిని దోపిడీ చేయాలని భావిస్తే అక్కడి అధికారులు, నాయకులు తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. నీటి మళ్లింపుపై కర్నూలు జిల్లా వాసులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తెలిపారు.

ఏపీఆర్‌జేసీ డీసీ సెట్ ప్రవేశాలకు దరఖాస్తులు

కర్నూలు ఎడ్యుకేషన్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని గురుకుల పాఠశాలలో 5వ తరగతిలో ప్రవేశానికి, 6, 7, 8 తరగతుల్లో ఖాళీగా ఉన్న సీట్లలో ప్రవేశానికి దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు కర్నూలు ఎస్‌ఏపీ క్యాంపు ఏపీ రెసిడెన్షియల్ కన్వీనర్, ప్రిన్సిపాల్ మహేశ్వరరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే ఏపీఆర్‌ఎస్ సీఏటీ-2025 జూనియర్ కళాశాలలు, నాగార్జున సాగర్ డిగ్రీ కళాశాల (బాలుర)లో మొదటి సంవత్సరంలో ప్రవేశానికి ఏపీఆర్‌జేసీ, డీసీ సెట్ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు ఈ నెల 31వ తేదీ వరకు Https://aprs.appfss.in వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్ చేసుకోవాలన్నారు. ఏప్రిల్ 25వ తేదీన ఏపీఆర్‌ఎస్ క్యాట్ ఉదయం 10 నుంచి 12 గంటల వరకు, ఏపీఆర్‌జేసీ అండ్ డీసీ సెట్-2025 అదే రోజు మధ్యాహ్నం 2.30 నుంచి 5 గంటల వరకు ప్రవేశ పరీక్ష జరుగుతుందన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని కన్వీనర్ మహేశ్వరరెడ్డి తెలిపారు. ఈ నెల 31వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

నీలితొట్ల వీధిలో మరొకరి మృతి

పరిస్థితిని పర్యవేక్షించిన కలెక్టర్ రాజకుమారి



నీలితొట్ల వీధిలో పర్యటిస్తున్న కలెక్టర్ రాజకుమారి

ఆత్మకూరు, మార్చి 3(ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు పట్టణంలోని నీలితొట్ల వీధికి పక్కనే ఉన్న గొల్లపేట కాలనీకి చెందిన రామచంద్రుడునాయక్ (60) శనివారం రాత్రి మృతి చెందాడు. దీంతో అక్కడి ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. అయితే మృతులు కలుషిత నీటిని తాగడం వల్లే వాంతులు, విరేచనాలు ప్రబలి మరణించారని బాధిత కుటుంబ సభ్యులు చెబుతున్నప్పటికీ అధికార యంత్రాంగం మాత్రం నిర్ధారించడం లేదు. ఇప్పటికే ఆత్మకూరు పట్టణానికి సరఫరా జరిగే వెలుగోడు రిజర్వాయర్ జలాలతో పాటు స్థానికంగా ఉన్న 35 బోర్‌వెల్స్, 19 మినరల్ వాటర్ ప్లాంట్స్ నమూనాలను ల్యాబ్‌లో పరీక్షించినప్పటికీ ఎలాంటి లోపాలు లేవని అధికారులు చెబుతున్నారు. అక్రమంలో మైక్రో బ్యాక్టీరియాను గుర్తించేందుకు పలు నీటి నమూనాలను కర్నూలుకు పంపించగా ఆ రిపోర్టులు మంగళవారానికి వచ్చే అవకాశం ఉంది. అయితే మృతి చెందిన వారిలో అతిసార లక్షణాలేవి లేవని అధికారులు ప్రాథమికంగా నిర్ధారిస్తున్నారు. కొత్తపల్లి మండలం శివపురం గ్రామానికి చెందిన బషీరూన్‌బీ (65) ఆత్మకూరు పట్టణంలోని నీలితొట్ల వీధిలో ఉంటున్న తన కొడుకు ఇంటి వచ్చి అనారోగ్యంతో ఆసుపత్రికి వెళ్లినట్లు తెలిసింది. అప్పటికే కొన్ని నెలలుగా ఆమె అనారోగ్యంతో బాధపడుతున్నట్లు సమాచారం. అలాగే నీలితొట్ల వీధికి చెందిన రహంతుల్లా (50) కూడా బలహీనంగా ఉండటంతో పాటు అధిక హైపర్ టెన్షన్‌కు లోనై మృతి చెందినట్లు రిపోర్టుల ఆధారంగా స్వయంగా కలెక్టరే ప్రకటించారు. శనివారం మరణించిన రామచంద్రుడునాయక్ కూడా కొంతకాలంగా పక్షపాతంతో బాధపడుతూ మృతి చెందారని, అతిసారతోనే మరణించినట్లు నిర్ధారణ కాలేదని వైద్యాధికారులు చెబుతున్నారు. అయితే ముగ్గురి మరణానికి అతిసార కారణం కాదని అధికారులు బలంగానే చెబుతున్నప్పటికీ వాస్తవ కారణాలను మాత్రం స్పష్టంగా వెల్లడించకపోవడం అనుమానాలకు తావిస్తోంది.

ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు

ఆత్మకూరు పట్టణంలోని నీలితొట్ల వీధి, గొల్లపేట కాలనీల్లో అతిసార ప్రబలి మరో వ్యక్తి మృతి చెందారన్న ప్రచారంతో ఆదివారం కలెక్టర్ రాజకుమారి హుటాహుటిన ఆత్మకూరుకు చేరుకుని బాధిత కుటుంబాలను పరామర్శించారు. అలాగే ఆయా కాలనీల ప్రజలతో మాట్లాడి వివరాలు సేకరించారు. ప్రస్తుతం కాలనీల్లో జరుగుతున్న ప్రభుత్వ సేవలపై వైద్య, మున్సిపల్, రెవెన్యూ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడుతూ ప్రస్తుతం ఆయా కాలనీలకు పైపులైన్ల ద్వారా నీటి సరఫరా నిలిపి వేసి ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేస్తున్నట్లు చెప్పారు. ప్రజలెవరూ ఆందోళన చెందాల్సిన అవసరమేమి లేదని, ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. అనంతరం ఆమె స్థానిక సీహెచ్‌సీని సందర్శించి అక్కడ బాధితులకు అందుతున్న వైద్యసేవల గురించి ఆరా తీశారు. ఈమె వెంట ఆత్మకూరు ఆర్డీవో నాగజ్యోతి, డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ వెంకటరమణ, డీసీహెచ్‌ఓ జహురుల్లా, తహసీల్దార్ రత్నరాధిక, మున్సిపల్ కమిషనర్ రమేష్‌బాబు, వైద్యాధికారులు ఉన్నారు.

కంది రైతు కన్నీరు

(5వ పేజీ తరువాయి)

మధ్యలో ఏమైందో తెలియదు గాని, కొనుగోళ్లను భారీగా తగ్గించారు. ప్రస్తుతం కర్నూలు జిల్లాలో 13వేల మెట్రిక్ టన్నులు, నంద్యాల జిల్లాలో 9వేల మెట్రిక్ టన్నులు కందులను మాత్రమే కొనుగోలు చేస్తామని అధికారులు ప్రకటించడంతో రైతులు దిక్కుతోచని పరిస్థితి ఎదుర్కొంటున్నారు. బహిరంగ మార్కెట్‌లో వ్యాపారులు క్వింటం కందులకు రూ.6వేల నుంచి 7వేలలోపే ధరను అందించడమే కాకుండా తరుగు, తేమ తదితర కారణాలతో ఒక బ్యాగు కందుల మీద 4 కిలోలు తీసుకుంటున్నారు. వ్యాపారుల అక్రమాలను అరికట్టాల్సిన అధికారులు ఏ మాత్రం పట్టించుకోకపోవడం లేదని డీసీఎంఎస్ కొనుగోలు కేంద్రాల వద్ద రైతులు అంటున్నారు. కర్నూలు జిల్లాలో ఇప్పటి దాకా 2,600 మెట్రిక్ టన్నులను 1870 మంది రైతుల నుంచి కొన్నామని, వారికి రూ.7.70 కోట్లు చెల్లించాల్సి ఉండగా.. ఇప్పటికే 1.58 కోట్లు రైతుల బ్యాంకు ఖాతాలకు జమ చేశామని మార్క్‌ఫెడ్ మేనేజర్ రాజు తెలిపారు. అదే విధంగా నంద్యాల జిల్లాలో 1,800 మెట్రిక్ టన్నుల కందులను 1,345 మంది రైతుల నుంచి కొన్నారు.

కేంద్ర గిడ్డంగుల సంస్థ రైతులకు న్యాయం చేయాలి

కేంద్ర గిడ్డంగుల సంస్థ గోదాముల్లో కందులను నిల్వ చేసుకుండా తప్పించుకొనేందుకు రకరకాల కారణాలు చెబుతున్నది. డీసీఎంఎస్ కేంద్రాల వద్ద కందులు నాణ్యంగా ఉంటేనే మా సిబ్బంది రైతుల నుంచి కొంటున్నారు. అలాంటప్పుడు కేంద్ర గిడ్డంగుల సంస్థ అధికారులు కందులు నాణ్యంగా లేవని వెనక్కి పంపడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఈ పరిస్థితిని అర్థం చేసుకుని నిబంధనలను కొంత మేరకు సడలించాలని విజ్ఞప్తి చేశాం. రైతులు ఇంటి వద్దనే కందులు శుభ్రం చేసి కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని అవగాహన కల్పిస్తున్నాం. కందులు కొన్న తర్వాత గంటల వ్యవధిలో రైతులకు డబ్బు చెల్లిస్తున్నాం.

- రాజు, జిల్లా మేనేజర్, మార్క్‌ఫెడ్

నాణ్యత లేదని వెనక్కి పంపుతున్న సీడబ్ల్యూసీ అధికారులు

ప్రస్తుతం కేడీసీఎంఎస్ కేంద్రాల రైతుల నుంచి కందుల కొనుగోళ్లను మార్క్‌ఫెడ్ అధికారులు వేగవంతం చేశారు. ఈ కేంద్రాల్లో నాణ్యతను పరిశీలించిన తర్వాతనే లారీల్లో వాటిని కేంద్ర గిడ్డంగుల సంస్థకు పంపుతున్నారు. అయితే.. వివిధ కారణాలతో కందులను గోదాముల్లో నిల్వ చేసుకునేందుకు కేంద్ర గిడ్డంగుల సంస్థ నానా రకాలుగా ఆటంకాలు సృష్టించడంతో కొనుగోలు కేంద్రాల సిబ్బందికి దిక్కుతోచడం లేదు. దీంతో కొన్న కందులను లారీల్లో మళ్లీ వెనక్కి తీసుకువచ్చి రైతులకు అప్పజెప్తున్నారు. ఈ పరిణమానికి రైతులు కన్నీళ్లు పెట్టుకుంటున్నారు. రవాణా ఖర్చులు, హమాలీల ఖర్చులు కలుపుకుంటే తమకు మార్క్‌ఫెడ్ అధికారులు చెల్లిస్తున్న మద్దతు ధర ఏ మాత్రం గిట్టుబాటు కాదని, మార్కెట్ యార్డుల్లో వ్యాపారులకు అమ్ముకోవడమే మేలని రైతులు కర్నూలు మార్కెట్ యార్డుకు వెళుతున్నారు. తమకు మామూళ్లు ఇవ్వడం లేదనే సాకుతో పాటు వివిధ కారణాల వల్ల కేంద్ర గిడ్డంగుల సంస్థ అధికారులు ఉద్దేశ పూర్వకంగానే కందులను గోదాముల్లోకి అనుమతించకుండా వెనక్కి పంపిస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. ప్రతి రోజూ కర్నూలు మార్కెట్ యార్డుకు రైతులు దాదాపు వందల మెట్రిక్ టన్నుల కందులు తీసుకొస్తున్నారు.

ఫైరింగ్‌లో గోల్డ్ మెడల్ సాధించిన కుమారీ చైతన్య స్వరూపిణి

అభినందించిన హోమ్ మంత్రి అనిత



ఫైరింగ్‌లో గోల్డ్ మెడల్ సాధించిన చైతన్య

కర్నూలు అర్బన్, మార్చి 2(ఆంధ్రజ్యోతి): ఎక్సైజ్ శాఖలో హెడ్ కానిస్టేబుల్‌గా పని చేస్తున్న వెంకటేశ్వర్లు కూతురు కుమారి చైతన్య స్వరూపిణి ఫైరింగ్ విభాగంలో గోల్డ్ మెడల్ సాధించారు. 2024 బ్యాచ్‌లో 394 మందిలో సబ్ ఇన్‌స్పెక్టర్ (సీవిల్)శిక్షణ పూర్తిచేసుకుని ఫైరింగ్ విభాగంలో ప్రతిభ సాధించారని ఎక్సైజ శాఖ సీఐ చంద్రహాస్ తెలిపారు. హోంమంత్రి అనిత చేతుల మీదుగా బంగారు పథకాన్ని అందుకుని తండ్రి గౌరవాన్ని పెంచిన ఆమె కృషి అభినందనీయమని కొనియాడారు. మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కోరుకుంటూ అమె మరిన్ని పథకాలు సాధించాలని ఆకాంక్షించారు.



అట్టహాసంగా బండలాగుడు పోటీలు



పోటీలను ప్రారంభిస్తున్న టీటీడీ బోర్డు సభ్యుడు మల్లెల రాజశేఖర్

ఓర్వకల్లు, మార్చి 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని కాల్వబుగ్గ రామేశ్వర స్వామి మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా రైతు సంఘం ఆధ్వ ర్యంలో నిర్వహించిన అంతర్ రాష్ట్ర స్థాయి న్యూకేటగిరి బండలాగుడు పోటీలు అట్టహాసంగా కొనసాగాయి. ఆదివారం మండలంలోని కాల్వబుగ్గ క్షేత్రంలో బండలాగుడు పోటీలను టీటీడీ బోర్డు సభ్యులు, నంద్యాల జిల్లా అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్ ప్రారంభించారు. తెలుగు రాష్ట్రాల నుంచి 22 జతల ఈ పోటీల్లో పాల్గొన్నాయి. మొదటి విజేతగా తెలంగాణ రాష్ట్రం బాపట్ల గ్రామానికి చెందిన రైతు వజ్రాల తేజేశ్వర రెడ్డి ఎద్దులు 6వేల అడుగుల దూరం లాగి రూ.1.50 లక్షల నగదును గెలుపొందాయి. రెండో విజేతగా ప్లోసూరు మండలం పల్నాడు చెందిన వీరబ్రహ్మనా యుడు ఎద్దులు 5745 అడుగుల దూరం లాగి రూ.1.30 లక్షల నగదు ను గెలుపొందాయి. మూడో విజేతగా గుంటూరు జిల్లా పెద్దపొట్టిపాడు గరికపాటి లక్ష్మయ్య చౌదరి ఎద్దులు 5,418 అడుగుల దూరం లాగి రూ.1. 10 లక్షల నగదును గెలుపొందాయి. నాలుగో విజేతగా తెలంగాణ రాష్ట్రం కొత్తకోట గ్రామానికి చెందిన బొజ్జ విద్యాఓబుల్ రెడ్డి ఎద్దులు 5,328 అడుగుల దూరం లాగి రూ.90వేల నగదును గెలుపొందాయి. ఐదో విజేతగా కడప జిల్లా దువ్వూరు మండలం గొల్లపల్లి గ్రామానికి చెందిన వారాది రామ్‌చరణ్ ఎద్దులు 5,286 అడుగుల దూరం లాగి రూ.70వేల నగదును సాధించాయి. ఆరో విజేతగా నంద్యాల జిల్లా బేతంచెర్ల మండలం గోర్లగుట్ట గ్రామానికి చెందిన బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి ఎద్దులు, ఏడో విజేతగా గుంటూరు జిల్లా పెద్దకాకాని మండలం ఉప్పనూరు గ్రామానికి చెందిన రైతు తోట శ్రీనివాసరావు ఎద్దులు గెలుపొందాయి. ఎనిమిదో విజేతగా తెలంగాణ గద్వాల జిల్లా దరూరు గ్రామానికి చెందిన వెంకటరెడ్డి ఎద్దులు గెలుపొందాయి. విజేతలకు దాతలు మద్దిలేటి, ఖాదర్ బాషా, జిలాని బాషా, కాకి రామకృష్ణుడు, కాకి దేవేంద్ర, బైరి హనుమంతరావు, శ్రీనివాసవైన్స్ చంద్ర పెద్ద స్వామి, ఆకుల మహేష్, మాబులాల్, మాల రామకృష్ణ, చెరువు రామకృష్ణుడు, చిన్న అయ్యన్నలు నగదును అందజేశారు. ఈ పోటీలకు వ్యాఖ్యాతగా వాడాల రామనాయుడు వ్యవహరించారు. కార్యక్రమంలో ఈవో మద్దిలేటి, ఉత్సవ కమిటీ సభ్యులు కాటినేని నారాయణ, కాకి దేవేంద్ర, టీడీపీ సీనియర్ నాయకులు చదువుల సుధాకర్ రెడ్డి, మోహన్ రెడ్డి, రైతు సంఘం నాయకులు జీకే సుధాకర్, కేవీ మధు, బజారు, జయకృష్ణ, గొల్ల నాగరాజు, వేణు, పొట్టి తిరుపతి, రామన్నగారి నారాయణ, శ్రీనివాసులు, పాల్గొన్నారు.

ఉత్సవమూర్తులు కాల్వకు తిరుగు ప్రయాణం



స్వామి అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను కాల్వకు తీసుకెళ్తున్న భక్తులు

ఓర్వకల్లు, మార్చి 2(ఆంధ్రజ్యోతి): కాల్వబుగ్గ రామేశ్వర స్వామి మహా శివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా కాల్వ గ్రామం నుంచి స్వామి అమ్మవార్ల ఉత్సవమూర్తులను కాల్వబుగ్గకు తీసుకొచ్చారు. అయితే ఫిబ్రవరి 25 నుంచి ఈ నెల 2వ తేదీ వరకు స్వామి అమ్మవార్ల ఉత్సవ మూర్తులకు వివిధ పూజలు నిర్వహించారు. భక్తులు స్వామి అమ్మవార్లకు కాయ కర్పూరాలు సమర్పించారు. ఆదివారం స్వామి అమ్మవార్ల ఉత్సవ మూర్తులను పల్లకిలో అధిష్టించి ఆలయ ప్రధాన అర్చకులు కల్లె లక్ష్మీనారాయణ శర్మ, కల్లె నరసింహశర్మ పూజలు నిర్వహించారు. మేళ తాళాలతో, నంది కోల సేవలు, భజంత్రీలతో స్వామి అమ్మవార్ల ఉత్సవ మూర్తులను కాల్వబుగ్గ ఆలయం నుంచి కాల్వ గ్రామానికి తీసుకువెళ్లారు. కార్యక్రమంలో ఆలయ ఈవో మద్దిలేటి, ఉత్సవ కమిటీ సభ్యులు కాటినేని నారాయణ, కాకి దేవేంద్ర, లక్ష్మీదేవి, వరలక్ష్మి, మాత్యు నాయక్, ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

ముగిసిన రోజా దర్గా ఉరుసు



దర్గాలో ప్రార్థనలు చేస్తున్న పీఠాధిపతి సజ్జదే నషీన్ సయ్యద్‌షా దాదాపాషా ఖాద్రి, మత పెద్దలు

కర్నూలు కల్చరల్, మార్చి 2(ఆంధ్రజ్యోతి): నగరంలోని రోజా వీధిలో వెలసిన దర్గాలో 535వ ఉరుసు ఉత్సవాలు ఆదివారం మధ్యాహ్నంతో ముగిశాయి. మూడు రోజుల పాటు కొనసాగిన ఈ ఉత్సవాలకు వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు దర్గాలో సమాధి అయిన ఆధ్యాత్మిక గురువు హజరత్ సయ్యద్ షా ఇష్హాక్ సనావుల్లా ఖాద్రికి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి, మొక్కులు తీర్చుకున్నారు. వేడుకల్లో భాగంగా శనివారం అర్ధ రాత్రి నుంచి ఆదివారం తెల్లవారు జాము వరకు హైదరాబాదు, కర్నూలుకు చెందిన మతపెద్దల ఉద్బోధనలు, ఖవ్వాలి బృందం కార్యక్రమం ఆసాంతం ఆకట్టుకుంది. దర్గా పీఠాధిపతి సజ్జదే నషీన్ సయ్యద్ షా దాదాపాషా ఖాద్రి ఇతర మత పెద్దలతో కలిసి ఉరుసు ముగింపు ప్రార్థనలు నిర్వహించారు. ఆదివారం మధ్యాహ్నం దర్గాలో పీఠాధిపతి దాదాపాషా ఖాద్రి, మత పెద్దల ఆధ్వర్యంలో 'జియారత్ ఫాతేహాల్' కార్యక్రమంతో ఉర్సు ఉత్సవాలు ముగిశాయి.

విచారణకు ఆదేశించిన అధికారులు

'పైసలిస్తేనే సాగునీరు' కథనానికి స్పందన



రైతులను విచారిస్తున్న జేఈ మోహన్‌రావు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

కోడుమూరు, మార్చి 2(ఆంధ్రజ్యోతి): రైతుల నుంచి డబ్బులు దండు కొని పంటలకు ఎల్లెల్సీ నీటిని అందించారని ఆంధ్రజ్యోతిలో ఆదివారం ప్రచురితమైన 'పైసలిస్తేనే సాగునీరు' అనే శీర్షికకు ఉన్నతాధికారులు స్పందించారు. నీటిపారుదలశాఖ ఈఈ కైలేశ్వరరెడ్డి వెంటనే విచారణ చేపట్టాలని ఎల్లెల్సీ కోడుమూరు సబ్ డివిజన్ జేఈఈ మోహన్‌రావును ఆదేశించారు. ఇందులో భాగంగా ఎల్లెల్సీ కోడుమూరు సెక్షన్ పరిధిలోని 8ఎల్ కాల్వ కింద ఉన్న రైతులను విచారించారు. ఈ సందర్భంగా వివర ణాత్మక నివేదికను ఉన్నతాధికారులకు పంపిస్తామని జేఈ మోహన్‌రావు తెలిపారు. విచారణ పేరుతో 8ఎల్ రైతులకు నీరు నిలుపుదల చేశారని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఎండుతున్న పంటలను కాపాడుకోవాలంటే నీటిని విడుదల చేయాలని కోరారు.

నేడు నగర పాలకలో వినతుల స్వీకరణ

కర్నూలు న్యూసిటీ, మార్చి 2(ఆంధ్రజ్యోతి): నగర పాలక కార్యాలయం లో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వినతులను స్వీకరించనున్నట్లు కమిషనర్ ఎస్.రవీంద్రబాబు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలో ఎక్కడైనా కాలనీల్లో సమస్యలు ఉంటే అర్జీ ఇవ్వాలని కోరారు. ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నగర పాలక కార్యాలయంలో నిర్వహించే కార్యక్రమాన్ని ప్రజలు వినియోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు.

రేపు సీపీఐ జిల్లా కార్యవర్గ సమావేశం

కర్నూలు న్యూసిటీ, మార్చి 2(ఆంధ్రజ్యోతి): సీపీఐ జిల్లా కార్యవర్గస మావేశం ఈ నెల 5న సీఆర్ భవన్‌లో నిర్వహించనున్నట్లు జిల్లా కార్య దర్శి బి.గిడ్డయ్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి రాష్ట్ర కార్యదర్శి కే.రామక్రిష్ణ, రాష్ట్ర కార్యదర్శివర్గసభ్యుడు పి.రామచంద్రయ్య హాజరవుతారన్నారు. సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో జిల్లాకు జరిగిన అన్యాయం, పెండింగ్ ప్రాజెక్టులకు నిధుల కేటాయింపుపై ప్రభుత్వ నిర్లక్ష్యం, వలసల నివారణలో ప్రభుత్వం వైఫ ల్యంపై చర్చ ఉంటుందన్నారు. జిల్లా కార్యవర్గసభ్యులు తప్పక హాజరు కావాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

పశువైద్య విద్యార్థులకు అండగా ఉంటాం

కర్నూలు అగ్రికల్చర్, మార్చి 2(ఆంధ్రజ్యోతి): వెటర్నరీ కాలేజీలలో ప్రొఫెసర్ల పోస్టులు భర్తీ చేయాలని పశువైద్య విద్యార్థులు చేస్తున్న ఆందోళనకు తాము అండగా ఉంటామని ఏపీ రైతు సంఘం జగన్నాథం, జిల్లా సహాయ కార్యదర్శి శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం రైతు సంఘం, ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ నాయకులు జిల్లా పశుసంవర్ధకశాఖ జేడీ శ్రీనివాసులుకు వినతిపత్రం అందజేశారు. పశువైద్య విద్యార్థులకు స్టయిఫండ్ పెంచాలని, ఖాళీగా ఉన్న పశువైద్య పోస్టులను భర్తీ చేయాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్ర మంలో రైతు సంఘం నాయకుడు సురేంద్ర, ఏఐవైఎఫ్ జిల్లా కార్య దర్శి శ్రీనివాసులు, నగర అధ్యక్ష, కార్యదర్శులు నాగరాజు, బీసన్న పాల్గొన్నారు.

అక్రమ అరెస్టును ఖండించాలి

కర్నూలు న్యూసిటీ, మార్చి 2(ఆంధ్రజ్యోతి): సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణ మూర్తి అక్రమ అరెస్టును ప్రతి ఒక్కరూ ఖండించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య ఒక ప్రకటనలో తెలి పారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన విశాఖ ఎల్‌జీ పాలిమర్స్ కేసుకు సంబంధించి బాధితుల తరపున పోరాడినందుకు అప్పటి ప్రభు త్వం అక్రమ కేసు పెట్టిందన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత గత ప్రభుత్వం పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేస్తారని చెప్పా రని గుర్తుచేశారు. తక్షణమే సత్యనారాయణ మూర్తిపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేయాలని ఆయన డిమాండ్ చేశారు.

చదువుతోపాటు క్రీడల్లో రాణించాలి

కర్నూలు ఎడ్యుకేషన్, మార్చి 2(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని పాఠశాల ఏజీఎం రమేష్ కుమార్ అన్నారు. ఆదివారం స్థానిక యేల్కూరు బంగ్లా నారాయణ పాఠశాలలో ప్రీమియర్ లీగ్ క్రీడా పోటీలు ఘనంగా ప్రారంభమయ్యారు. ముఖ్య అతిథిగా రమేష్ కుమార్ హాజరై క్రీడాల్లో భాగస్వామ్యం అయినప్పుడే విద్యార్థులు చదువుపై ఆసక్తి చూపిస్తారని గుర్తించిన నారాయణ యజ మాన్యం క్రీడలకు అధిక ప్రాధాన్యం ఇస్తుందన్నారు. ఇందులో భాగంగా విద్యార్థుల సాంస్కృతిక నృత్యాలు, మార్చ్ ఫాస్ట్ ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో క్లస్టర్ ప్రిన్సిపాల్ అన్వర్ బాషా, రామాంజనేయులు, శ్రీని వాసరెడ్డి, కౌషద్ జాహా పాల్గొన్నారు.

ఆర్డీవో అటెండర్ మృతి

కర్నూలు రూరల్, మార్చి 2(ఆంధ్రజ్యోతి): కర్నూలు ఆర్డీవో దఫేదారు (అటెండరు) సి.నాగరాజు (50) ఆదివారం ఉదయం 10 గంటలకు మృతి చెందారు. నాగరాజు కొన్ని రోజుల క్రితం ఛాతి నొప్పి రావడంతో కుటుంబ సభ్యులు కర్నూలులోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించారు. వెంటిలేటర్‌పై చికిత్స పొందుతున్న నాగరాజు పరిస్థితి విషమించడంతో తుదిశ్వాస విడిచారు. నాగరాజుకు భార్య, ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. విషయం తెలుసుకున్న కర్నూలు ఆర్డీవో కిడారి సందీప్‌కుమార్, పరిపాలన అధికారి వేణుగోపాలరావు ఆర్డీవో కార్యాలయ సీనియర్, జూనియర్ అధికారులు, సిబ్బంది కలిసి నాగరాజు పార్థివదేహాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళర్పించి, కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. వారితో పాటు కర్నూలు డివిజనల్ పరిధిలోని తహసీల్దార్లు నాగరాజుకు భౌతికాయాన్ని సందర్శించి నివాళి అర్పించారు.

వృద్ధులకు చెప్పులు, గొడుగులు పంపిణీ



గొడుగులు, చెప్పులు పంపిణీ చేస్తున్న డాక్టర్ శంకర్‌శర్మ

కర్నూలు హాస్పిటల్, మార్చి 2(ఆంధ్రజ్యోతి): ఎండల తీవ్రత అధికంగా ఉందని, వృద్ధులు, చిన్న పిల్లలు ఎండవేడిమికి గురి కాకుండా జాగ్రత్తలు పాటించాలని సీనియర్ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు డాక్టర్ శంకర్‌వర్మ అన్నారు. ఆదివారం నగరంలోని గాయత్రీ ఎస్టేట్‌లో ఉన్న గురుదత్త పాలిక్లీనిక్‌లో ఆయన వృద్ధులకు చెప్పులు గొడుగులను పంపిణీ చేశారు. ఎండాకాలం మార్చి, ఏప్రిల్, మే నెలల్లో కొనసాగుతుందని, ఈ మూడు నెలలు ఎండవేడిమికి గురి కాకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు.

ఎస్టీ రిజర్వేషన్ పునరుద్ధరించండి



మంత్రి నారా లోకేశ్‌కు వినతి పత్రం ఇస్తున్న టీడీపీ పార్లమెంటు ఉపాధ్యక్షుడు బేతం కృష్ణుడు

కర్నూలు కలెక్టరేట్, మార్చి 2(ఆంధ్రజ్యోతి): వాల్మీకుల ఎస్టీ రిజర్వేషన్ పునరుద్ధరించాలని తెలుగుదేశం పార్టీ పార్లమెంటు ఉపాధ్యక్షుడు బేతం కృష్ణుడు మంత్రాలయం పర్యటనకు వచ్చిన రాష్ట్ర విద్య, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్‌కు వినతిపత్రం సమర్పించారు. ఎస్టీ రిజర్వేషన్ పునరుద్ధరించి వాల్మీకులకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో పీవీఎస్ఎస్ అధ్యక్షుడు పెద్దయ్య తదితరులు పాల్గొన్నారు.

'రంగముని సేవలు ప్రశంసనీయం'



రంగముని చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న డీఎస్పీ మహబూబ్ బాషా, కళాకారులు

కర్నూలు కల్చరల్, మార్చి 2(ఆంధ్రజ్యోతి): జిల్లా నాటకరంగానికి సంగీత గురువు, దివంగత దాసరి రంగముని చేసిన సేవలు ప్రశంసనీయమని ఏపీఎస్పీ డీఎస్పీ మహబూబ్ బాషా కొనియాడారు. ఆదివారం నగరంలోని టీజీవీ కళాక్షేత్రంలో, రంగమాధురి కళాలయం ఆధ్వర్యంలో సంగీత గురువు, గాయకుడు రంగముని 8వ వర్ధంతి సభ, శాస్త్రీయ నృత్య ప్రదర్శనలు, సంగీత గురువులకు సత్కార కార్యక్రమాలు జరిగాయి. మహబూబ్ బాషా మాట్లాడుతూ జిల్లాలో వందలాది మంది శిష్యులను తయారు చేసిన ఘనత రంగమునికి దక్కుతుందని చెప్పారు. సభాధ్యక్షత వహించిన కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య మాట్లాడుతూ రంగముని రాష్ట్ర ప్రభుత్వ కందుకూరి పురస్కారంతో పాటూ నంది నాటక పోటీలకు సంగీత గురువుగా పని చేశారని కీర్తించారు. ఈ కార్యక్రమంలో సాహితీ స్రవంతి ప్రతినిధులు బసవరాజు, జేఎన్ శేష య్య, విద్యుత్తుశాఖ ఏడీ సుబ్బన్న, బీసీ సంఘం జాతీయ కార్యదర్శి నక్కలమిట్ట శ్రీనివాసులు, రంగమాధురి కళాలయం అధ్యక్షుడు డి. వెంకటరమణ ప్రసంగించారు. అనంతరం దాసరి రంగముని జ్ఞాపకార్థం నిర్వహించిన 'స్వర తరంగాలు' కార్యక్రమంలో చిన్నారుల శాస్త్రీయ, సంగీత నృత్య ప్రదర్శనలు అలరించారు. అనంతరం బాల సాహిత్య రచయిత డాక్టర్ ఎం. హరికిషన్‌తోపాటూ పలువురు రంగస్థల సంగీత గురువులను ఘనంగా సత్కరించారు.

ఆ ఔట్ సోర్సింగ్ ఉద్యోగిదే హవా..!

కర్నూలు హాస్పిటల్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలోని ఆరోగ్యశ్రీలో పని చేస్తున్న డేటా ఎంట్రీ ఆపరేటర్ సూపరింటెండెంట్ కార్యాలయంలో అన్నీ తానై వ్యవహరిస్తున్నాడు. ఆర్థిక లావాదేవీలన్నీ తన కనుసైగల్లో నిర్వహిస్తున్నట్టు తెలుస్తోంది. కొందరు సీనియర్ అసిస్టెంట్లకు బినామీగా వ్యవహరిస్తున్నాడన్న ఆరోపణలు ఉన్నాయి. ఆరు నెలల క్రితం శానిటేషన్‌లో పని చేస్తున్న అతనిపై ఆరోపణలు రావడంతో ఓ అధికారి ఆదేశాల మేరకు తొలగించారు. మళ్లీ ఇప్పుడు ఆరోగ్యశ్రీ డాక్యుమెంటేషన్‌లో డేటా ఎంట్రీ ఆపరేటర్‌గా విధుల్లో చేరి కార్యాలయంలో సదరం, ఆరోగ్యశ్రీ, చెక్‌బుక్, క్యాష్ బుక్‌లు, అన్నీ తానే రాస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. సూపరింటెండెంట్ ఆఫీసులో రెగ్యులర్ ఉద్యోగులతో సమానంగా కూర్చుంటూ వారిపై పెత్తనం చేస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఇతని వద్దనే సదరం సర్టిఫికెట్లు లాగిన్ ఐడీ, ఎంఆర్‌టీ పాస్‌వర్డ్, హెచ్‌వోడీ క్యాష్ బుక్, చెక్‌బుక్‌లు పెట్టుకోవడం గమనార్హం. ఇంత జరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. కొందరు సీనియర్ అసిస్టెంట్లు సహకారం, అధికారుల సహకారం వల్లే ఇదంతా జరుగుతున్నట్టు తెలుస్తోంది. ఈ విషయంపై కర్నూలు జీజీహెచ్ సూపరింటెండెంట్ డా.కే.వెంకటేశ్వర్లును వివరణ కోరగా ఆ ఉద్యోగి ఆరోగ్యశ్రీలో ఔట్‌సోర్సింగ్ కింద పని చేస్తున్నారని వివరణ ఇచ్చారు.

గోకులంలో ప్రారంభమైన బ్రహ్మోత్సవాలు



పూజలకు హాజరైన భక్తులు

కర్నూలు కల్చరల్, మార్చి 2(ఆంధ్రజ్యోతి): నగర శివారులోని గోదా రంగనాథస్వామి దేవస్థానంలో ఆలయ ద్వితీయ వార్షిక బ్రహ్మోత్సవాలు ఆదివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఆలయ అర్చక స్వాములు రమేష్ భట్టార్, కిరణ్ భట్టార్, లక్ష్మీనారాయణాచార్యులు, మహేషా చార్యుల ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా, పంచాహ్నిక దీక్షతో, వేద మంత్రోచ్ఛార ణలతో ఉత్సవాలను ప్రారంభించారు. ఉదయం స్వామి, అమ్మవార్ల సుప్ర భాత సేవతో ఆరంభించిన ఈ వేడుకల్లో పంచాంగ శ్రవణం, విశ్వరూప సేవ, ప్రాతః ఆరాధన, నివేదన తదితర కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం స్వామి అమ్మవార్ల ఉత్సవ మూర్తులతో మేళతాళాలు, మంగళ వాయిద్యాలతో దేవస్థానం మాడవీధుల్లో ఊరేగించారు. సాయంత్రం విష్ణు సహస్రనామస్తోత్ర పారాయణం, ఉత్సవానుజ్ఞ, స్వస్తివాచనం, విష్వక్సేనా రాధన, పుణ్యాహవాచనం, రక్షాబంధనం, రుత్విక్వరణం, విష్వక్సేన మర్యా ద, మృత్సంగ్రహనం, అంకురార్పణం, ధ్వజాధివాసం, నివేదన వంటిని చేపట్టారు. ఈ సందర్భంగా గోకులం వ్యవస్థాపక అధ్యక్షుడు మారం నాగరాజ గుప్త, మేనేజింగ్ ట్రస్టీ పల్లెర్ల నాగరాజు మాట్లాడుతూ ఈ బ్రహ్మోత్సవాలు త్రిదండి అష్టాక్షరీ సంపత్కుమార రామానుజ జీయర్ స్వామి ప్రత్యక్ష పర్యవేక్షణలో జరగనున్నాయని తెలిపారు. సోమవారం నుంచి ఈనెల 8 వరకు నిత్యం రెండు పూటలా స్వామి, అమ్మవార్లకు వాహన సేవలు, నిత్యపూజాది కార్యక్రమాలు కొనసాగుతాయని తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు ఇటిక్యాల పుల్లయ్య, వేముల జనార్ధన్, లింగం క్రిష్ణయ్యశెట్టి, వేముల రవిప్రకాశ్ పాల్గొన్నారు.

కార్మికులను విస్మరిస్తున్న ప్రభుత్వాలు



మాట్లాడుతున్న మునెప్ప

కర్నూలు న్యూసిటీ, మార్చి 2(ఆంధ్రజ్యోతి): కార్మికులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విస్మరిస్తున్నాయని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఎస్. మునెప్ప అన్నారు. ఆదివారం కార్యాలయంలో జరిగిన సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ 44 కార్మిక చట్టాలను రద్దు చేసి, నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకువచ్చి కార్మికులను భానిసలుగా చేస్తున్నారన్నారు. విదేశీ పెట్టుబడులను 100 శాతం అనుమతించి దేశ సంపదని కార్పొరేట్లకు అప్పగిస్తున్నారని విమర్శించారు. కార్మికుల సమస్యల పరిష్కారానికి ఈ నెల 3న కలెక్టరేట్ ఎదుట, 6న డీఎంఅండ్ హెచ్‌ఓ, 10న చలో విజయవాడ కార్యక్రమాలను జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షుడు కె.అజయ్‌బాబు, ఉపప్రధాన కార్యదర్శి ఎన్.కృష్ణయ్య, కోశాధికారి చంద్రశేఖర్, సహాయ కార్యదర్శి నాగరాజు పాల్గొన్నారు.

నేటి నుంచి ఉరుసు

ఓర్వకల్లు, మార్చి 2(ఆంధ్రజ్యోతి): ఓర్వకల్లులో వెలసిన హజరత్ సయ్యద్ సుల్తాన్ మహమూద్ షాఖాద్రి స్వామివారి ఉరుసు ఉత్సవాలు సోమవారం నుంచి ఈనెల 5వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు గురువులు ఎస్ఎండీ నజురుల్లా షాఖాద్రి, ఎస్ఎండీ షఫీ, అల్లాషాఖాద్రి ఆదివారం తెలిపారు. ఈనెల 3న గంధం పూజ, 4న ఉరుసు, అన్నదానం, 5న కిస్తీలు నిర్వహిస్తామన్నారు.

4న కబడ్డీ పోటీలు: ఉరుసు సందర్భంగా ఈనెల 4వ తేదీన జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ పోటీల్లో పాల్గొనే టీములకు వరుసగా నాలుగు బహుమతులు రూ.15 వేలు, రూ.10వేలు, రూ.5వేలు, రూ.3వేలు నగదును అందజేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ప్రవేశ రుసుం రూ.500 చెల్లించాలన్నారు. అదేవిధంగా ఈనెల 5న వాలీబాల్ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ పోటీల్లో పాల్గొనే టీమ్ సభ్యులు ప్రవేశ రుసుం రూ.200 చెల్లించి చాలన్నారు. పోటీల విజేతలకు వరుసగా నాలుగు బహు మతులు రూ.5వేలు, రూ.3 వేలు, రూ.2వేలు, రూ.1000లు నగదును అందజేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అలాగే ట్రాక్టర్ రివర్స్ పందెం, స్లో మోటార్ సైకిల్ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

హ్యాండ్‌బాల్ పోటీల నిర్వహణ భేష్

కర్నూలు స్పోర్ట్స్, మార్చి 2(ఆంధ్రజ్యోతి): మాజీ ఎమ్మెల్సీ మహ్మద్ ఇక్బాల్ ఆధ్వర్యంలో హ్యాండ్‌బాల్ పోటీలను నిర్వహించడం అభినందనీయమని జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షులు రామాంజనేయులు అన్నారు. ఆదివారం స్థానిక టీ.క్యాంపు క్రీడా మైదానంలో ఏర్పాటు చేసిన హ్యాండ్‌బాల్ ఆహ్వానిత పోటీల ప్రారంభ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. జిల్లాలో పలు ప్రాంతాల్లో మాజీ ఎమ్మెల్సీ మహ్మద్ ఇక్బాల్ సొంత నిధులను వెచ్చించారన్నారు. నాలుగు జట్లు హ్యాండ్‌బాల్‌లో పోటీ పడగా కల్లూరికి చెందిన బదీ సాహెబ్ జట్టు విన్నర్స్ స్థానంలో నిలిచి కప్పు కైవసం చేసుకుంది. కార్యక్రమంలో జిల్లా హ్యాండ్‌బాల్ సంఘం కార్యదర్శి పి.సువర్ణ, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సామాజిక సేవకు నిలువెత్తు నిదర్శనం

కర్నూలు రాజ్‌విహార్ సర్కిల్ మార్చి 2(ఆంధ్రజ్యోతి): మెగా ఫ్యామిలీ, ఫ్యాన్స్ అంటే సామాజిక సేవకు నిలువెత్తు నిదర్శనమని అఖిల భారత చిరంజీవి యువత వ్యవస్థాపక అధ్యక్షుడు రావణ స్వామి నాయుడు అన్నారు. ఆదివారం నగరంలోని ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో మెగా అభిమానుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన రావణస్వామి నాయుడు మాట్లాడుతూ జనసేన పార్టీ కూటమి ప్రభు త్వంలో భాగస్వామి కావడం, పవన్‌కల్యాణ్ మంత్రిగా ఉండటం తమ అదృష్టమన్నారు. జల్‌జీవన్ పథకాన్ని సద్వినియోగం చేసుకుని గ్రామీణ ప్రాంతాల్లో నీటి సమస్యను తీర్చేలా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈనెల 14న జనసేన ఆవిర్భావ దినోత్సవం, 27న సినీ నటుడు రాంచరణ్ జన్మదినాన్ని మెగా అభిమానులు పండలా నిర్వహించాలని తెలి పారు. ఈ సందర్భంగా పోస్టర్‌ను విడుదల చేశారు. కార్యక్ర మంలో చిరంజీవి యువత రాష్ట్ర అధ్యక్షుడు భవాని రవికుమార్, చింత సురేష్‌బాబు, కొండల్, వీర మహిళ సుభాషిణి పాల్గొన్నారు.

రూ.25 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలి



మాట్లాడుతున్న రవికుమార్

కర్నూలు అర్బన్, మార్చి 2(ఆంధ్రజ్యోతి): సి.బెళగల్ మండలం పోలకల్ గ్రామంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో ప్రమాదానికి గురై ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన విద్యార్థిని శ్రీలేఖ కుటుంబానికి ప్రభుత్వంరూ. రూ.25 లక్షలు ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని రాయల సీమ విద్యార్థి పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు రవికుమార్ డిమాండ్ చేశారు. ఆదివారం నగరంలోని రాయలసీమ విద్యార్థి పోరాట సమితి కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు సుంకన్న, అశోక్, వసంత్‌కుమార్ పాల్గొన్నారు.

కర్నూలు ఎడ్యుకేషన్: విద్యార్థిని శ్రీలేఖ కుటుం బానికి ప్రభుత్వం రూ.50 లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా శాఖ డిమాండ్ చేసింది. విద్యార్థి కుటుంబానికి ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ ప్రగాఢ సాను భూతి తెలియజేశారు. అలాగే గాయపడిన విద్యార్థినులకు కూడా ఆర్థిక సాయం అందించాలని డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ నగర అధ్యక్ష, కార్యదర్శులు అబూబకార్, సాయి ఉదయ్, అమర్ బాబా పాల్గొన్నారు.

● శ్రీలేఖ కుటుంబానికి ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని పీఎస్‌యూ జిల్లా కార్యదర్శి సురేష్ ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఎలాంటి సంఘటనలు జరగకుండా పాఠశాలల విద్యాశాఖ చర్యలు తీసుకోవాలని కోరారు. గాయపడిన విద్యార్థినులకు మెరుగైన వైద్యం అందించి ఆర్థిక సాయం ఇవ్వాలని కోరారు.

మింగడం కష్టంగా ఉన్న రోగులకు 'పోయెమ్'

గ్యాస్ట్రో ఎంట్రాలజీ వైద్యుల చికిత్స విజయవంతం



రోగికి పోయెమ్ ఎండోస్కోపిక్ చికిత్స అందిస్తున్న వైద్యులు

కర్నూలు హాస్పిటల్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): ఆహారం మింగడంలో ఇబ్బంది ఉన్న ఆకలేషియా కార్డియో ఉన్న ఇద్దరు రోగులకు కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల గ్యాస్ట్రో ఎంట్రాలజీ విభాగంలో వైద్యులు పోయెమ్ ఎండోస్కోపిక్ ద్వారా విజయవంతంగా నిర్వహించారు. తెలంగాణ రాష్ట్రం గద్వాల జిల్లాకు చెందిన అహ్మద్‌బీ (65) డోన్ మండలం చిన్న మల్కాపురం చెందిన వి.రఘు (28) కొన్ని నెలలుగా మింగడం కష్టంగా ఉండటంతో ఇబ్బంది పడుతున్నారు. దీంతో కర్నూలు జీజీహెచ్ గ్యాస్ట్రో ఎంట్రాలజీ విభాగాధిపతి డా.జి.మోహన్ రెడ్డిని కలిసి తమ సమస్యను వివరించారు. రోగులకు పరీక్షలు నిర్వహించిన ఆయన అన్నవాహికలో సమస్య ఉన్నట్లు గుర్తించి పోయెమ్ ఎండోస్కోపిక్ నిర్వహిస్తామన్నారు. ఆదివారం గ్యాస్ట్రో ఎంట్రాలజీ విభాగంలో ఈఆర్‌సీపీ ఆపరేషన్ థియేటర్‌లో హైదరాబాదు కిమ్స్ హాస్పిటల్‌కు చెందిన గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు డా.శ్రీకాంత్ గ్యాస్ట్రో ఎంట్రాలజీ హెచ్‌వోడీ డా.జి.మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో ఇద్దరి రోగులకు పోయెమ్ ఎండోస్కోపిక్ ద్వారా చికిత్సను కుట్లు లేకుండా విజయవంతంగా నిర్వహించారు. కార్యక్రమంలో గ్యాస్ట్రో ఎంట్రాలజి అసిస్టెంట్ ప్రొఫెసర్లు డా.అర్షియా, డా.ప్రవీణ్ కుమార్ పాల్గొన్నారు.

కేవీఆర్ డిగ్రీ కళాశాల విద్యార్థినుల ప్రతిభ

కర్నూలు స్పోర్ట్స్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): రాజమండ్రిలో ఇటీవల జరిగిన ఖేలో ఇండియా సీనియర్స్ రాష్ట్ర స్థాయి ఉషూ పోటీల్లో కేవీఆర్ డిగ్రీ కళాశాల విద్యార్థినులు ఏడు పతకాలు సాధించారు. ఆదివారం కాలేజీ ఆవరణంలో అభినందన సభలో ప్రిన్సిపాల్ వీవీఎస్ కుమార్ హాజరై విద్యార్థినులను అభినందించారు. ఈ రోజుల్లో మహిళలకు ఉషూ మార్షల్ ఆర్ట్స్ నేర్చుకోవడం వల్ల ఆత్మరక్షణ కోసం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఖేలో ఇండియాలో పతకాలు సాధించడం గర్వకారణమన్నారు. ఈ సందర్భంగా బంగారు పతకాలు సాధించిన దేవి, శ్రావణి, జయలలిత, వెండి పతకాలు సాధించిన చిన్న గర్జమ్మ, రాధిక, నసీమ, బ్రౌంజ్ పతకం సాధించిన నందినిలను ఆయన అభినందిచారు.

మూతపడ్డ శుద్ధజల ప్లాంటు

- ఉప్పరపల్లిలో ఏర్పాటు చేసిన నాటి డిప్యూటీ సీఎం కేఈ
- వైసీపీ ప్రభుత్వం నిధులు ఇవ్వకపోవడంతో మూత
- ఇబ్బందులు పడుతున్న 18 గ్రామాల ప్రజలు



ఉప్పర్లపల్లిలో మూతపడ్డ సుజల స్రవంతి వాటర్ ప్లాంట్

తుగ్గలి, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉప్పర్లపల్లిలో రూ.3 కోట్లతో రూ.లక్షలు వెచ్చించి శుద్ధజల వాటర్ ప్లాంటును 2019లో నాటి టీడీపీ ప్రభుత్వ హాయంలో నాటి డిప్యూటీ సీఎం కేఈ కృష్ణమూర్తి ప్రారంభించారు. ఇక్కడి నుంచి దాదాపు 18 గ్రామాల్లోని మినీ ప్లాంట్లకు శుద్ధ జలాన్ని సరఫరా చేయాలన్నది లక్ష్యం. ప్రారంభంలో బాగున్నా అనంతరం నిర్వహణ లేకపోవడంతో ప్లాంటు మూతపడింది. రూ.3కోట్ల ప్రజాధనం వృథా అయింది.

నిర్వహణ లేకపోవడమే కారణం

ప్లాంటు నిర్వహణలో ఇబ్బందులు రావడం తోనే మూతపడిందని సమాచారం కాంట్రాక్టరు, సిబ్బందికి లావాదేవీల్లో తేడా వచ్చాయని దీంతో సరఫరా నిలిచిపోయిందని తెలుస్తోంది.

నిర్వహణ మరచిన వైసీపీ ప్రభుత్వం

అనంతరం అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం ప్లాంటు నిర్వహణను అటకెక్కించిందని ఆరోపణలు ఉన్నాయి. నిధులు ఇవ్వకపోడంతో నిర్వహణ బారమై సిబ్బందికి జీతాలు కూడా ఇవ్వలేని పరిస్థి తుల్లో వాటర్ ప్లాంటును మూసివేశారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి శుద్ధజల ప్లాంటును పునరుద్ధరించి అందించాలని కోరుతున్నారు.

శుద్ధజలం అందడం లేదు



ప్లాంటు పని చేయకపోవడంతో శుద్ధజలం అందక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. రూ.20లు వెచ్చించి నీటిని కొనుగోలు చేయాల్సిన పరిస్థితి. ప్లాంటును పునరుద్ధరిస్తే రూ.2లకే బిందె నీరు అందుతుంది. - మల్లికార్జున, గిరిగెట్ల

పంచాయతీకి అప్పగించాం

ఉప్పర్లపల్లిలోని శుద్ధల ప్లాంటును గ్రామ పంచాయతీకి అప్పగించాం. కొన్ని కారణలతో మూతపడింది. మరమ్మతులకు నిధులు మంజూరు చేయాలని అధికారులకు ప్రతిపాదనలు పంపాము. నిధులు వచ్చిన వెంటనే మరమ్మతులు చేసి అన్ని గ్రామాలకు సురక్షిత నీరు అందిస్తాం. - నరేష్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ, తుగ్గలి

విద్యుత్ సరఫరాలో మార్పులు

మద్దికెర, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తోటలకు విద్యుత్ సరఫరాలో వేళల్లో మార్పులు చేశామని, విద్యుత్ ఏఈ మహ్మద్ రఫీ తెలిపారు. ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ మండలంలోని పెరవలి ఫీడర్, నంచర్ల ఫీడర్, కొత్తపల్లి ఫీడర్లలో వ్యవసాయ తోటలకు ఉదయం 5 నుంచి 10 గంటల వరకు, మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉంటుందని, రైతులు గమనించాలని కోరారు.

జె.హోసళ్లిలో సామూహిక వివాహాలు



వివాహాలు చేసుకున్న నూతన జంటలు

హోలహర్వి, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జె.హోసళ్లి గ్రామంలోని పట్టదస్వామి ఆలయంలో థోత్సవం సందర్భంగా ఆదివారం సామూహిక వివాహాలు నిర్వహించారు. పల్లకోత్సవం, గంగపూజ. అభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు. సామూహిక వివాహాల్లో 10 జంటల వధువరులకు నూతన వస్త్రాలిచ్చి వివాహం చేశారు. పీఠాధిపతి ఆజాత శంభులింగ స్వామి పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటాం



ఆర్థిక సాయం అందిస్తున్న జనసేన నాయకులు

ఆలూరు, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): కార్యకర్తలకు అండగా ఉంటామని జనసేన ఆలూరు ఐటీ కోఆర్డినేటర్ బోయ రంజిత్ అన్నారు. ఆదివారం పెద్దహోతూరు గ్రామ కార్యకర్త కటిగే రంగస్వామికి ప్రమాదంలో కాలు విరిగిపోవడంతో ఆయనను పరామర్శించారు. 50కేజీల బియ్యం, రూ.9వేలు అందించారు., తేవుల వీరేష్, మహదేవ్, హనుమేష్, సోమశేఖర్, బోయ శేఖర్, లింగన్న పాల్గొన్నారు.

మెడికల్ రీయింబర్స్‌మెంట్ వెంటనే విడుదల చేయాలి

ఆదోని అగ్రికల్చర్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగ ఉపాధ్యాయుల మెడికల్ రీయింబర్స్‌మెంట్‌ను వెంటనే విడుదల చేయాలని ఏపీటీఎఫ్ మండల అధ్యక్షుడు ముత్తన్న డిమాండ్ చేశారు. ఆదివారం ప్రాంతీయ కార్యాలయంలో ముఖ్యనాయకుల సమావేశం నిర్వహించారు. ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందన్నారు. ప్రావిడెంట్ ఫండ్ రుణాలు, ఈఎల్‌ఎస్‌లను చెల్లించాలన్నారు. బడ్జెట్‌లో ఉద్యోగ ఉపాధ్యాయులకు కేటాయింపులు లేకపోవడం నిరాశపరిచిందన్నారు. రామునాయక్, జయరాముడు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నాయకులు

బాధితురాలికి ఆర్థిక సాయం



ఆర్థిక సాయం చేస్తున్న కౌన్సిలర్ వెల్లాల లలితమ్మ

ఆదోని టౌన్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): బీజేపీ మహిళా కార్యకర్త ఉష భర్త అనారోగ్యంతో మృతి చెందడంతో కౌన్సిలర్ వెల్లాల లలితమ్మ ఆర్థిక సాయం చేశారు. ఆదివారం బాధితురాలిని పరామర్శించారు. లలితమ్మ, అధికార ప్రతినిధి ఆదూరి విజయ కృష్ణ మాట్లాడుతూ, ప్రతి బీజేపీ కార్యకర్తలకు పార్టీ అందుబాటులో ఉంటుందని, ఎమ్మెల్యే పార్థసారథి ప్రతి కార్యకర్తల కు తోడ్పాటును అందిస్తారని అన్నారు. పిల్లల చదువుకు పార్టీ పూర్తిగా అండదండలు అందిస్తుందన్నారు. వెల్లాల మధుసూదన్ శర్మ, యువ మోర్చా రాష్ట్ర మాజీ కార్యదర్శి శ్రీనివాస్ ఆచారి, కళ్లపోతుల సురేష్, వాల్మీకి సాయి ప్రసాద్, శ్రీకాంత్, మహేష్ నాయక్, నాగేష్, అంజయ్ కుమార్, జిందే ప్రకాష్, జాఫర్, వినయ్, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

సీనియర్ జర్నలిస్టు మృతి

పత్తికొండ టౌన్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన సీనియర్ జర్నలిస్టు నరేష్ కుమార్ యాదవ్ (50) ఆదివారం అనారోగ్యంతో మృతి చెందాడు. వివరాల మేరకు.. కొద్ది రోజులుగా కర్నూలులో ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. అయితే ఆదివారం కోలుకోలేక మృతి చెందాడు.

రైతులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలి



నలకదొడ్డిలో రైతు సభ్యత్వం చేయిస్తున్న నాయకులు

పత్తికొండ టౌన్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): రైతులకు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గిడ్డయ్య డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలోని నలకదొడ్డి గ్రామంలో రైతు సంఘం సభ్యత్వ నమోదును ప్రారంభించారు. రైతులు ఏటా అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. పంటలకు మద్దతు ధర లేదని, అతివృష్టి, అనావృష్టిలతో రైతులు ఏటేటా ఆర్థికంగా చితికిపోయి ఆత్మహత్యలకు పాల్పడుతున్నారన్నారు. అన్నదాత సుఖీభవ పథకాన్ని అమలు చేసి రైతులకు మద్దతు ధర కల్పించాలని, పంటల బీమాను వర్తింపజేయాలని కోరారు. రాజాసాహెబ్, తిమ్మయ్య, సురేంద్ర కుమార్ ఉన్నారు.

కళ్లల్లో దుమ్ము, ధూళి



దుమ్ముతో ఇబ్బంది పడుతున్న వాహనదారులు

దేవనకొండ, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రధాన రహదారి దుమ్ముతో నిండిపోవడంతో వాహనదారులు, పాదచారులు, దుకాణదారులు అవస్థలు పడుతున్నారు. సీసీ రోడ్డు లేకపోవడంతో వాహనాలు వెళుతుంటే విపరీతమైన దుమ్ము లేస్తోంది. బస్టాండ్ నుంచి ఎంపీపీ పాఠశాల కూడలి వరకు అర కి.మీ. మాత్రమే 12 అడుగుల మేర సీసీ రోడ్డు మాత్రమే ఉందని, 30 అడుగుల మేర నూతన రహదారి నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

పొంచి ఉన్న ప్రమాదం

- అదుపు తప్పితే ప్రాణాలు పోయే అవకాశం





ఆస్పరి-చిన్నహోతూరు మార్గంలో ప్రమాదకరంగా ఉన్న కల్వర్టులు

ఆస్పరి, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆస్పరి-చిన్నహోతూర్ రహదారిలో కల్వర్టులకు రక్షణ గోడ లేదు. వాహనదారులు ఏమాత్రం ఆదమరిచినా ప్రమాదం సంభవించే అవకాశం ఉంది. అధికారులు స్పందించి కల్వర్టులకు రక్షణ గోడలను నిర్మించాలని వాహనదారులు కోరుతున్నారు.

బడ్జెట్‌లో రాయలసీమకు అన్యాయం

- వేదవతి ప్రాజెక్టు ఊసే లేదు : ఎమ్మెల్యే విరుపాక్షి



ఆలూరులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విరుపాక్షి

ఆలూరు, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో రాయలసీమకు తీవ్ర అన్యాయం జరిగిందని ఆలూరు ఎమ్మెల్యే విరుపాక్షి ఆరోపించారు. ఆదివారం పట్టణంలోని ఆర్‌అండ్‌బీ అతిథిగృహంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. నాలుగు సార్లు సీఎంగా పనిచేసిన చంద్రబాబు వైసీపీ వాళ్లకు సంక్షేమ పథకాలు ఇస్తే పాముకు పాలు పోసినట్లే. అని చెప్పడం సరికాదన్నారు. సంక్షేమాన్ని పార్టీలకతీతంగా అమలు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వానికి ఉంటుందన్నారు. చంద్రబాబు రాష్ట్రంలో 5 కోట్ల జనాభాకు సీఎం అని గుర్తు చేశారు. దుర్మార్గ పాలన చేస్తే ప్రజలు కూటమి నాయకుల కాలర్ పట్టుకొని నిలదీసే రోజులు దగ్గర్లోనే ఉన్నాయన్నారు. మేనిఫెస్టోలో తొలి సంతకం డీఎస్సీపైనే చేస్తానని నిరుద్యోగులను మోసం చేశారన్నారు. ఉద్యోగాలు ఇవ్వకపోతే నిరుద్యోగ భృతి ఇస్తామని, మహిళలకు ఉచిత బస్సు హామీ ఎక్కడ అని ప్రశ్నించారు. రాష్ట్రాన్ని తాకట్టుపెట్టి రూ.1.30 వేల కోట్లు అప్పు చేసిన ఘనత చంద్రబాబుకే దక్కుతుందన్నారు. బడ్జెట్‌లో వేదవతి ప్రాజెక్టు ఊసే లేదన్నారు. రాయలసీమలో నీటి వనరులు లేక ప్రజలు తాగునీటి ఎద్దడి ఎదుర్కొంటున్నారన్నారు.వాల్మీకులను ఎస్టీల్లోకి చేస్తానని ఇచ్చిన హామీ ఏమైనట్లు అని ప్రశ్నించారు. ప్రజల తరపున ప్రభుత్వాన్ని నిలదీసేందుకు వైసీపీ ముందుంటుందన్నారు. సమావేశంలో వైసీపీ నాయకులు అరికెర వెంకటేశ్వరులు, నాగప్ప, మల్లికార్జున, భాస్కర్, వరుణ్, రాజు, నాగేష్, తిక్కస్వామి పాల్గొన్నారు.

తాగునీటి పైపులైన్‌కు మరమ్మతులు



మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

ఆదోని, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని భీమాస్ సర్కిల్ కూడలిలో తాగునీటి ప్రధాన పైపులైన్ లీకేజీకి గురైంది. నీరు వృథాగా పోతున్న విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే పార్థసారథి వెంటనే మరమ్మతులు చేయాలని ఆదేశించడంతో మున్సిపల్ సిబ్బంది సరి చేశారు.

యువకుడి అనుమానాస్పద మృతి

- అన్నతో కలిసి బెంగళూరులో వ్యాపారం చేస్తున్న అజయ్



దేవనకొండ, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బండపల్లి గ్రామానికి చెందిన అజయ్ (18) బెంగళూరులో అనుమానాస్పదంగా మృతిచెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన మేరకు.. గ్రామానికి చెందిన వడ్డె నరసింహులు, అనురాధకు రెండో కుమారుడు అజయ్ బెంగుళూరులో అన్న వద్ద ఉంటూ ముగ్గుపొడి వ్యాపారం చేస్తూ, డ్యాన్స్ నేర్చుకునేవాడు. శనివారం అన్న మహేష్ యధావిధిగా వ్యాపారానికి వెళ్లాడు. సాయంత్రం ఇంటికి రాగా తాళం వేసి ఉంది. ఫోన్ చేసినా స్పందించకపోవడంతో తాళం పగలకొట్టి చుడగా అజయ్ ఉరి వేసుకుని విగతజీవిగా మారాడు. అయితే తన తమ్ముడు ఉరేసుకుంటే బయట తాళం ఎలా వేశాడని అన్న మహేష్ అనుమానం వ్యక్తం చేశాడు. మృతుడి అన్న ఫిర్యాదు బెంగుళురులోని చాముండినగర్ ఈరన్నగుట్ట పోలీసు స్టేషన్లో కేసు నమోదైంది.

రైతులకు అండగా సీపీఐ

మద్దికెర, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): రైతులకు సీపీఐ అండగా ఉంటుందని జిల్లా రైతు సంఘం సహాయ కార్యదర్శి రాజాసాబ్ అన్నారు. ఆదివారం మండలంలోని పెరవలి గ్రామంలో రైతుల సంతకాలను సేకరించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు పించన్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. కౌలు రైతులకు బ్యాంకుల ద్వారా రూ.2లక్షలు రుణాలు ఇవ్వాలని కోరారు. శనగ పంటకు పంట నష్టపరిహారం ఇవ్వాలని కోరారు.

ఫలితాలు సాధించాలి

మద్దికెర, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాల, సతి గృహాల్లోని పదో తరగతి విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని ఎంఈవో రంగస్వామి, బీసీ హాస్టల్ వార్డెన్ రాజశేఖర్ రెడ్డి సూచించారు. ఆదివారం జడ్పీ పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. సమయాన్ని వృథా చేయవద్దని, పట్టుదలతో చదివి మంచి మార్కులు సాధించాలన్నారు. ఆదివారం కూడా మధ్యాహ్నం భోజనాన్ని ఏర్పాటు చేశామన్నారు.

రుణాలతో చేయూత

తుగ్గలి, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): బీసీ కార్పొరేషన్ రుణాలతో ప్రభుత్వం యువతకు చేయూత ఇస్తోందని విద్యాకమిటీ చైర్మన్ మిద్దె రవికుమార్, టీడీపీ పట్టణ అధ్యక్షుడు లక్ష్మణస్వామి అన్నారు. జొన్నగిరిలో మాట్లాడుతూ గతంలో రుణాలు లేక యువత ఇబ్బం దులు పడ్డారని, కూటమి అధికారంలోకి రాగానే రుణాలు అందుతున్నాయన్నారు. ఎమ్మెల్యే శ్యాంబాబు హంద్రీనీవా కాలువల ద్వారా చెరువులను నింపడానికి ఎంతో కృషి చేస్తున్నారన్నారు.

ఇద్దరికి గాయాలు

ఆలూరు, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అరికెర గ్రామ శివారులో ఆదివారం బైక్ అదుపు తప్పి ఇద్దరు గాయపడ్డారు. పోలీసుల తెలిపిన మేరకు.. గూళ్యం గ్రామానికి చెందిన ఇద్దరు ఆలూరు నుంచి గ్రామానికి వెళ్తుండగా బైక్ అదుపుతిప్పి పొలాల్లోకి దూసుకెళ్లింది. స్థానికులు క్షతగ్రాతులను ఆలూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వీరిలో పంపాపతి అనే యువకుడి తలకు బలమైన గాయాలు కావడంతో బళ్ళారి ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఆలూరు పోలీసులు తెలిపారు.

కరువు మండలంగా ప్రకటించాలి

మద్దికెర, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): మద్దికెరను కరువు మండలంగా ప్రకటించాలని వైసీపీ మండల అధ్యక్షుడు మల్లికార్జున యాదవ్, ఉపాధ్యక్షుడు కృష్ణా యాదవ్, బురుజుల భరత్ రెడ్డి డిమాండ్ చేశారు. రైతులు పంటలు నష్టపోయారని, కందులకు మాత్రమే గిట్టుబాటు ధర ఇచ్చి, శనగ, దనియాలు, జొన్నకు ఇవ్వలేదన్నారు.

రంజాన్ ఉపవాసాలు ప్రారంభం

మద్దికెర, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): రంజాన్ ఉపవాసాలు ప్రారంభమయ్యాయని మద్దికెర మసీదు పెద్దలు ఆకుల ఖాజావలి ఖలీల్, సలాం, సత్తార్ తెలిపారు. ఈనెల 1వ తేదీ శనివారం సాయంత్రం ఆకాశంలో నెలవంక కనిపించడంతో ఆదివారం నుంచి ఉపవాసాలు ప్రారంభిస్తున్నామన్నారు. ప్రతిరోజు మసీదులో నమాజ్ చేసేందుకు అన్ని సౌకర్యాలు కల్పించామని మసీదు పెద్దలు తెలిపారు.

నిబంధనలు పాటించాలి: సీఐ

గోనెగండ్ల, మార్చి 2(ఆంధ్రజ్యోతి): మోటార్ వాహన చట్టంలో జరిమానాలు భారీగా పెరిగాయని గోనెగండ్ల సీఐ గంగాధర్ తెలిపారు. ఆదివారం మాట్లాడుతూ లైసెన్స్ లేకపోతే రూ. 5 వేలు, హెల్మెట్ లేక పోతే రూ. 1000, ఇన్సూరెన్స్ లేకపోతే మొదటి సారి రూ. 2వేలు, రెండోసారి రూ. 4వేలు, సెల్‌ఫోన్ డ్రైవింగ్‌కు మొదటిసారి రూ. 1,500, రెండవ సారి రూ. 10వేలు, రెసింగ్, ప్రమాదకర డ్రైవింగ్‌కు మొదటి సారి రూ. 5వేలు, రెండోసారి రూ.10 వేలు, ట్రిపుల్ రైడింగ్, ఓవర్ స్పీడ్‌కు రూ. 1,000 జరిమానా విధిస్తున్నట్లు తెలిపారు.

పీఆర్సీ కమిటీని వెంటనే నియమించాలి : ఎస్టీయూ



మాట్లాడుతున్న ఎస్టీయూ కార్యదర్శి గోపాల్

ఆదోని అగ్రికల్చర్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): 12వ పీఆర్సీ కమిటిని వెంటనే నియమించాలని ఎస్టీయూ కార్యదర్శి గోపాల్ డిమాండ్ చేశారు. ఆదివారం ప్రాంతీయ కార్యాలయంలో ఆదోని కౌతాళం మండల శాఖల ముఖ్యానాయకుల సమావేశం మండల కార్యదర్శి సుధాకర్ బాబు అధ్యక్షతన నిర్వహించారు. 11వ పీఆర్సీ ముగిసి 20 నెలలు గడిచినా ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణితో వ్యవహరిస్తోందని ఆవేదనవ వ్యక్తం చేశారు. 30 శాతం ఐఆర్‌ను ప్రకటించాలని కోరారు. చింతకుంట రామకృష్ణ, అంజయ్య, భాస్కర్, వెంకటేశ్వర్లు, కోటేశ్వరయ్య పాల్గొన్నారు.

వైభవంగా రథోత్సవం



తుగ్గలి, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మిద్దె తండాలో సేవాలాల్ మహరాజ్ రథోత్సవాన్ని వైభవంగా నిర్వహిం చారు. ఆదివారం గ్రామస్థులు కానుకలు తీసుకువచ్చారు. విరాళా దాత పారా రామచంద్రప్రసాద్ విశేష పూజలు చేశారు. సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ఉత్సవ విగ్రహాన్ని రథంపై ఉంచి రథాన్ని ముందుకు కదిలించారు.

రథాన్ని లాగుతున్న భక్తులు

కార్యకర్తలకు మంత్రి భరోసా



మంత్రిని ఆలింగనం చేసుకుంటున్న మారుతి నాయుడు, వెంకటేష్ చౌదరి

ఆదోని రూరల్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): కార్యర్తలకు తాను అండగా ఉంటానని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మంత్రి లోకేష్ భరోసా నిచ్చారు. శనివారం మంత్రాల యానికి వచ్చిన మంత్రిని నాయకులు మారుతి నాయుడు, తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శి వెంకటేష్ చౌదరి కలిశారు.

ముందస్తు ప్రణాళికతో పారిశుధ్య పనులు

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

- పెరవలి పంచాయతీ కార్యదర్శి సుధాకర్



మద్దికెర, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): ముందస్తు ప్రణాళికతో పారిశుధ్య పనులు చేయిస్తున్నామని పెరవలి గ్రామ పంచాయతీ కార్యదర్శి సుధాకర్ తెలిపారు.

ప్రశ్న: గ్రావ జనాభా ఎంత?

జనాభా: 10వేల మంది.

ప్రశ్న: పారిశుధ్య కార్మికులు ఎంత మంది ఉన్నారు?

జవాబు: పంచాయతీ, స్వచ్ఛ భారత్ కార్మికులు కలిపి 14 మంది పనులు చేస్తున్నారు. ప్రతి రోజు ఉదయం వేళలో వీదులు శుభ్రం చేయడం, డ్రైనేజీలో పూడిక తీయడం, రాత్రి దోమల నివారణకు ఫాగింగ్ చేయిస్తున్నాం.

ప్రశ్న: గ్రామంలో రహదారులు, కాలువలు నిర్మించారా?

జవాబు: బస్టాండు నుంచి పంచాయతీ కార్యాలయం వరకు వరకు రోడ్డు అధ్వానంగా ఉండేది. కూటమి ప్రభుత్వం వచ్చాక తర్వాత రోడ్డు నిర్మించాం. మురుగు కాలువలు కూడా ఏర్పాటు చేశాం. మురుగు రోడ్డుపైకి రాకుండా చూస్తున్నాం.

ప్రశ్న: స్వర్ణ పంచాయతీ కార్యక్రమం ఎంతవరకు వచ్చింది?

జవాబు: గ్రామ సచివాలయ సిబ్బందితో స్వర్ణ పంచాయతీ సర్వే చేస్తున్నాం. కుటుంబ స్థితి గతులు, ఇంటి నిర్మాణ కొలతలు తీసుకుని ఆన్‌లైన్ చేస్తున్నాం. ఇప్పటి దాకా 80 శాతం పూర్తయింది.

ప్రశ్న: ఇంటి పన్నులు వసూళ్లు పూర్తి చేశారా?

జవాబు: గ్రామంలో ఇప్పటి వరకు 50 శాతం ఇంటిపన్నులు వసూలు చేశాం. నెలాఖరుకు వంద శాతం పూర్తి చేస్తాం.

ప్రశ్న: తాగునీటి పథకాలు పని చేస్తున్నాయా?

జవాబు: గ్రామంలో పీడబ్ల్యూఎస్ స్కీం ఒకటి, 17 బోర్ల ద్వారా గ్రామంలోని బీసీ కాలనీ, జగనన్న కాలనీలకు వేసవిని దృష్టిలో ఉంచుకుని సక్రమంగా నీరు అందిస్తున్నాం.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి



మాట్లాడుతున్న సీఐ అశోక్ కుమార్

కౌతాళం, మార్చి 2(ఆంధ్రజ్యోతి): మహిళలు అన్ని రంగాల్లో రాణించినప్పుడే దేశం అభివృద్ధి చెందుతుందని కౌతాళం సీఐ అశోక్ కుమార్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ పాఠశాలలో ముందస్తు అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ మహిళలు నేటి సమాజంలో అన్ని రంగాల్లో రాణిస్తూ ముందుకు దూసుకుపోతున్నారన్నారు. మహిళలపై జరుగుతున్న అరాచకాలను ధైర్యంగా ఎదుర్కొవాలని సూచించారు. ఈ సమావేశంలో పాఠశాల ప్రత్యేకాధికారి పుష్పలత, ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.

సీజనల్ హాస్టళ్లను నిర్వహించకపోతే చర్యలు



విద్యార్థుల భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంఈవో

మంత్రాలయం, మార్చి 2(ఆంధ్రజ్యోతి): మండలంలో ఏర్పాటు చేసిన సీజనల్ హాస్టళ్లను సక్రమంగా నిర్వహించకపోతే చర్యలు తప్పవని ఎంఈవో రాగన్న హెచ్చరించారు. ఆదివారం మండలంలోని మాధవరం, రచ్చుమర్రి, బూదూరు గ్రామాల్లో ఏర్పాటు చేసిన సీజనల్ హాస్టళ్లను ఆయన తనిఖీ చేశారు. విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలు విద్యాబోధన, వసతి, భోజనం పరిశీలించారు. మండలంలో మూడు కేంద్రాల్లో సీజనల్ హాస్టళ్ల కొనసాగుతున్నాయని, వీటిపై ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి సారించారన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం లక్ష్మీ నారాయణ, సీఆర్పీలు నరసన్నగౌడు, బంగారప్ప, పాల్గొన్నారు.

గ్రాసం కొరత

ట్రాక్టర్ రూ.18 వేలు



వరిగడ్డిని తీసుకెళ్తున్న ట్రాక్టర్

గోనెగండ్ల, మార్చి 2(ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది గ్రాసం ధర చుక్కలు చూపుతోంది. ఆదోని డివిజన్‌లో పత్తి, మిరప, ఉల్లి పంటలను రైతులు అధిక సంఖ్యలో సాగు చేశారు. దీంతో గ్రాసం కొరత ఏర్పడుతోంది. డివిజన్ వ్యాప్తంగా ఆవులు, ఎద్దులు దాదాపు 1.20 లక్షలు, గొర్రెలు, మేకలు దాదాపు 6లక్షలు ఉన్నట్లు అధికారుల లెక్కలు చెబుతున్నాయి. గోనెగండ్ల, నందవరం, మంత్రాలయం, ఎమ్మిగనూరు, పెద్దకడుబూరు, కోసిగి, మండలాల్లో అధిక వర్షాలు కురవడంతో చేతికి అందిన గ్రాసం నల్లగా మారిపోయింది. ఇతర ప్రాంతాల నుంచి ట్రాక్టర్ గ్రాసం రూ.15వేల నుంచి 18 వేల వరకు చేస్తున్నారు. కొంత మంది గ్రాసాన్ని కొనుగోలు చేయలేక పశువులను కబేళాలకు తరలిస్తున్నారు. ప్రభుత్వం గ్రాసాన్ని పంపిణీ చేయాలని రైతులు కోరుతున్నారు.

శ్రీమఠానికి విరాళం

మంత్రాలయం, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): రాఘవేంద్రస్వామి మఠానికి బెంగళూరుకు చెందిన కల్పవృక్ష చారిటబుల్ ట్రస్ట్ యాజమాన్యం రూ. రెండు లక్షలు అన్నదానానికి విరాళంగా ఇచ్చినట్లు ఏఏఓ మాధవశెట్టి, మేనేజర్లు వెంకటేష్ జోషి, సురేష్ కోణాపూర్ తెలిపారు. ఆదివారం కుటుంబ సమేతంగా రాఘవేంద్ర స్వామిని దర్శించుకుని రూ.2 లక్షల చెక్కును విరాళం ఇచ్చినట్లు తెలిపారు. విరాళం ఇచ్చిన దాత కుటుంబానికి పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు రాఘవేంద్ర స్వామి మెమెంటో, శేషవస్త్రం ఇచ్చి ఆశీర్వదించారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ అనంతపురాణిక్, నరసింహ దేశాయ్, శ్రీపాద ఆచార్, గిరిధర్ ఆచార్ పాల్గొన్నారు.

ఇండోర్ స్టేడియం ఏర్పాటు చేయాలి

కోసిగి, మార్చి 2(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన కోసిగిలో ఇండోర్ స్టేడియం, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, బీసీ గురుకుల పాఠశాలను ఏర్పాటు చేయాలని ఏఐవైఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి ఎం.రాజు అన్నారు. ఆదివారం వారు స్థానిక విలేకర్లతో మాట్లాడారు. మంత్రాలయం నియోజకవర్గంలో వంద పడకల ప్రభుత్వ ఆసుపత్రితో పాటు ఆర్డీఎస్ కుడి కాలువ నిర్మాణ పనులు చేపట్టాలని, వలంటీర్ల వ్యవస్థను తిరిగి కొనసాగించాలని, రాష్ట్ర వ్యాప్తంగా ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. పలు సమస్యలను వినతి రూపంలో మంత్రి లోకేశ్‌కు సమర్పించినట్లు ఆయన తెలిపారు.

ఆటో కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

సీఐటీయూ మండల కార్యదర్శి రాముడు



మాట్లాడుతున్న రాముడు

ఎమ్మిగనూరు టౌన్, మార్చి 2(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఆటో కార్మికులపై పెంచిన చలానాలను తక్షణమే రద్దు చేయాలని సీఐటీయూ మండల కార్యదర్శి రాముడు డిమాండ్ చేశారు. ఆదివారం ఆటో యూనియన్ నాయకులతో కలిసి ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం విధించిన జీఎస్టీతో ఆటో డ్రైవర్ కార్మికుల జీవితాలు దారుణంగా మారాయన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల సమ యంలో ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేస్తామని 50 ఏళ్లకే పింఛన్ ఇస్తామని హామీలు ఇచ్చారన్నారు. వాహన మిత్రులకు తమ ప్రభుత్వం వస్తే రూ.30 వేల ఇస్తామని హామీ ఇచ్చారన్నారు. బడ్జెట్లో ఆటో కార్మికులకు ఎటువంటి సంక్షేమ పథకాలు కేటాయించ కపోవడం అన్యాయమన్నారు. ఆటో కార్మికులకు వివిధ రూపాల చలానాల భారం అధికమైందని ఆవేదన వ్యక్తం చేశారు. కొత్త చలానా విధానాన్ని ఆటో కార్మికులు వ్యతిరేకించాలని అన్నారు. కార్యక్రమంలో మోహన్‌దాస్, షబ్బీర్, మధు, రంగన్న తదితరులు పాల్గొన్నారు.



నాడు గుంతలమయమైన ఎమ్మిగనూరు- నందవరం రోడ్డు



నేడు అదే దారిలోని బీటీ రోడ్డు

కూటమి మాట.. అభివృద్ధికి బాట

● గుంతల రహదారికి మరమ్మతులు

● హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజలు

నందవరం, మార్చి 2(ఆంధ్రజ్యోతి): సరైన రహదారులు లేక ఎన్నో ఏళ్లుగా నరకం అనుభవించారు. రహదారికి మరమ్మతులు చేపట్టాలని అనేక సార్లు ప్రజాప్రతినిధులకు, ఉన్నతాధికారులకు మొర పెట్టుకున్న గత ఐదేళ్లుగా అలకించేవారే కరువయ్యారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత రహ దారుల రాతలే మారిపోయాయి. ఎమ్మిగనూరు నుంచి నందవరానికి వెళ్లే రహదారికి అడుగగడు గునా గుంతలు పడ్డాయి. గత వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లుగా పట్టించుకోలేదు. దీంతో ఎన్నికల సమయంలో తాము అధికారంలోకి వస్తే రహదారి మరమ్మతులు చేపడుతామని టీడీపీ హామీ ఇచ్చింది. అధికారంలోకి వచ్చిన వెంటనే రహదారి మరమ్మతులకు నిధులు మంజూరు చేసి బాగు చేశారు. ఈ రహదారిపై ఆరు గ్రామాల ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. అడుగడుగున గుంతలు పడడంతో ప్రజలు తీవ్ర ఇబ్బంది పడేవారు. ఈ రహదారికి మరమ్మతులు చేపట్టడంతో ప్రయాణం హాయిగా సాగుతుందని ప్రయాణికులు, వాహనదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

గతంలో నరకం అనుభవించాం



గత వైసీపీ ప్రభుత్వంలో ఈ రోడ్డు నుంచి హైద్రాబాద్‌కు వెళ్లాలంటే నరకం అనుభవించాం. రోడ్డు బాగు చేయడంతో ప్రయాణానికి ఇబ్బందిలేకుండా ఉంది. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత రోడ్లకు మహర్దశ వచ్చింది. దీంతో ఇప్పుడు హైదరాబాద్‌కు వెళ్లాలంటే ఈ రోడ్డు ద్వారానే ప్రయాణిస్తాం. దాదాపు 70 కిలో మీటర్ల దూరం తుగ్గతుంది.

\- వలీ, డ్రైవర్

నిబంధనలు పాటించాలి: సీఐ

గోనెగండ్ల, మార్చి 2(ఆంధ్రజ్యోతి): మోటార్ వాహన చట్టంలో జరిమానాలు భారీగా పెరిగాయని గోనెగండ్ల సీఐ గంగాధర్ తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ వాహనదారులు నిబంధనలను పాటించాలని కోరారు. పెరిగిన జరిమానాల ప్రకారం లైసెన్స్ లేకపోతే రూ.5 వేలు, హెల్మెట్ లేకపోతే రూ.1000, ఇన్సూరెన్స్ లేకపోతే మొదటిసారి రూ.2 వేలు, రెండోసారి రూ.4 వేలు, సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేస్తే మొదటిసారి రూ.1500, రెండోసారి రూ.10 వేలు, రేసింగ్, ప్రమాదకర డ్రైవింగ్‌కు మొదటిసారి రూ. 5వేలు, రెండోసారి రూ. 10 వేలు, ట్రిపుల్ రైడింగ్, ఓవర్ స్పీడ్‌కు రూ.1000 జరిమానా విధిస్తున్నట్లు ఆయన తెలిపారు. మార్చి ఒకటి నుంచి కొత్త ట్రాఫిక్ నిబంధనలు అమలులోకి వచ్చాయ న్నారు.

విద్యుత్ కోతలు లేకుండా చూడాలి

కౌతాళం, మార్చి 2(ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం విద్యార్థులకు పరీక్షల సమయమని విద్యుత్ కోతలు లేకుండా చూడాలని విద్యార్థుల తల్లిదండ్రులు ఖాజా, ఈరన్న, రామాంజనేయులు కోరారు. ఆదివారం వారు విలేకరులతో మాట్లాడుతూ ఇంటర్ పరీక్షలు ప్రారంభమైనాయని సమయ పాలన లేకుండా విద్యుత్ కోతలు విధించడంతో విద్యార్థులు చదువుకునేందుకు ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. త్వరలో పది పరీక్షలు కూడా ప్రారంభమవుతున్నాయని, దీనిని దృష్టిలో ఉంచుకోని కోతలు లేకుండా విద్యుత్ సరఫరా చేయాలని వారు కోరారు.

వద్దన్నా వినరే..!

● మైనర్ల కారణంగా పెరుగుతున్న రోడ్డు ప్రమాదాలు

● తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చినా ఫలితం శూన్యం

గోనెగండ్ల, మార్చి 2(ఆంధ్రజ్యోతి): ఇటీవల కాలంలో మైనర్లు రోడ్డు ప్రమాదాలకు ఎక్కువగా గురవుతున్నారు. ఏ గ్రామంలో చూసినా రయ్.. రయ్‌మంటూ వేగంగా బైక్‌లపై దూసుకుపోతున్నారు. తగిన వయస్సు దేహదారుఢ్యం లేకున్నా కూడా ద్విచక్రవాహనాలను వేగంగా నడుపుతూ ప్రమాదాలకు గురవుతున్నారు. గోనెగండ్ల మండలంలో మైనర్లు వాహనాలు నడుపుతూ పోలీసుల తనిఖీల్లో పట్టుబడుతున్నారు. ఆరు నెలల కాలంలో దాదాపు 150 మంది పట్టుబడినట్లు పోలీసుల రికార్డులు తెలుపుతున్నాయి. అనధికారికంగా మరిన్ని ఉన్నట్లు సమాచారం. మండలంలో ఎక్కువగా ఏ ప్రాంతంలో ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయో అధికారులు సర్వేలు జరిపారు. మలుపుల దగ్గర, రోడ్డు క్రాసింగ్‌ల దగ్గర ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నట్లు గుర్తించారు.

అవగాహన కల్పిస్తున్నప్పటికీ అమలు శూన్యం

పోలీసులు ఎప్పటికప్పుడు వాహనాలను తనిఖీ చేసి మైనర్లను పట్టుకొని అవగాహన కల్పిస్తున్నప్పటికీ ఫలితం కనిపించడం లేదు. మైనర్లు వాహనాలు నడుపరాదని, పట్టుబడితే కేసులు నమోదు చేస్తామని తల్లిదండ్రులకు హెచ్చరించినా పరిస్థితుల్లో మార్పు పెద్దగా కనిపించడం లేదు.

వాహన చట్టం ఏమిటంటే: మోటారు వాహన చట్టం ప్రకారం 18 ఏళ్ల వయస్సు నిండిన వారు గేర్లు లేని వాహనాన్ని నడపవచ్చు. 18 ఏళ్లు పూర్తయిన తరువాత డ్రైవింగ్ అనుమతి పొందడానికి ఇతర వాహనాల ను నడిపేందుకు చట్టం అంగీకరిస్తుంది. వయో అర్హత ఉన్న వారికి రవాణా శాఖ ఆధ్వర్యంలో తగిన పరీక్షలు నిర్వహించి అనంతరం డ్రైవింగ్ లైసెన్స్ ఇస్తారు. పిల్లలు వాహనం నడుపుతూ పోలీసులకు పట్టుబడితే చట్టం ప్రకారం శిక్షార్హుడే. అదే సమయంలో వాహన యజమానిపై కూడా కేసు నమోదు చేయవచ్చు.



గోనెగండ్ల సమీపంలో పమాద స్థలాలను గుర్తిస్తున్న ఎంవీఐ కె. శిరీష, సీఐ గంగాధర్

తల్లిదండ్రులదే బాధ్యత



వాహన చట్టం ప్రకారం డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనం నడిపేందుకు వీలు లేదు. మైనర్లు వాహనం నడుపుతూ పట్టుపడితే తల్లిదండ్రులదే బాధ్యత. తమ పిల్లల ఇంటి వద్ద నిరంతరం నిఘా ఉంచాలి. తగిన వయస్సు దేహదారుఢ్యం పెరిగే వరకు డ్రైవింగ్ నేర్పించరాదు. చిన్న వయస్సులో అధికధరలకు చెందిన వాహనాలు ఇప్పించడం వల్ల ప్రమాదాలకు గురవుతున్నారు.

\- గంగాధర్, సీఐ, గోనెగండ్ల

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

మండల అభివృద్ధికి కృషి

ఎంపీడీవో పుల్లయ్య



నందవరం, మార్చి 2(ఆంధ్రజ్యోతి): మండలంలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని ఎంపీడీవో పుల్లయ్య అన్నారు. ఆదివారం ఆయన ఆంధ్రజ్యోతితో మాట్లాడారు.

ప్రశ్న: వలసలు నివారణకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

జవాబు: వలసల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటాన్నాం. ప్రతి గ్రామంలో ప్రత్యేక సభలు ఏర్పాటు చేసి అవగాహన కల్పిస్తూ వలసలు నివారించే విధంగా చర్యలు తీసుకుంట్నాం. ప్రతి గ్రామంలో ఉపాధి కూలీ పనులు కల్పిస్తున్నాం.

ప్రశ్న: ఎన్ఆర్‌జీఎస్ కింద నిధులు ఎంత మేరకు వచాయి?

జవాబు: ఇప్పటి వరకు రూ. మూడు కోట్లు నిధులు వచ్చాయి. అందులో రూ. రెండు కోట్లు ఖర్చు చేశాం. మిగతా కోటి కూడా ఖర్చు చేస్తున్నాం.

ప్రశ్న: వేసవి కాలంలో తాగునీటి ఎద్దడి నివారణకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

జవాబు: ఎన్‌టీఆర్ సుజలస్రవంతి ద్వారా గ్రామాల్లో తాగునీటి ఎద్దడి లేకుండా చూస్తున్నాం. హ్యాండ్ పంపులు మరమ్మతులు చేయిస్తున్నాం.

ప్రశ్న: జలజీవన పనులు సక్రమంగా జరిగాయా?

జవాబు: మండలంలో జలజీవన పనులకు టెండర్లు పిలిచాం. కేవలం నందవరానికి మాత్రమే కాంట్రాక్టర్ ముందుకు వచ్చాడు. పైపులైన్ పనులు కూడా సక్రమంగా జరిగాయి.

ప్రశ్న: మండలంలో ఎంతమంది ఉపాధి కూలీలు ఉన్నారు?

జవాబు: మండలంలో మొత్తంగా 26,178 మంది కూలీలు ఉన్నారు.

ప్రశ్న: సమ్మర్ స్టోరేజ్ ద్వారా తాగునీరు అందుతుందా?

జవాబు: హలహర్వి సమ్మర్ స్టోరేజ్ ద్వారా ధర్మాపురం, బాపురం, జగ్గాపురం గ్రామాలకు ఇబ్బంది లేకుండా తాగునీరు అందుతుంది.

మూడు తులాల బంగారం చోరీ

ఎమ్మిగనూరు టౌన్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు పట్టణంలోని హెచ్‌బీఎస్ కాలనీలో శనివారం ఓ ఇంట్లో మూడు తులాల బంగారం చోరీ అయినట్లు పట్టణ సీఐ శ్రీనివాసులు తెలిపారు. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. విశ్రాంత వ్యవసాయ శాఖ అధికారి మేఘనాథ్ హెచ్‌బీఎస్ కాలనీలో నివాసం ఉంటున్నారు. ఐదురోజుల క్రితం వైద్యం కోసం చెన్నైకు కుటుంబ సభ్యులతో కలిసి వెళ్లారు. ఇంటికి తాళం వేసి ఉండడంతో ఇదే అదునుగా భావించి దొంగలు చోరీకి పాల్పడ్డారు. అయితే పనిమనిషి సాయంత్రం యథావిధిగా ఇంటి పనుల నిమిత్తం రాగా అప్పటికే తాళాలు పగలగొట్టి తలుపులు తెరిచి ఉండడంతో ఈ విషయాన్ని కాస్త ఫోన్ ద్వారా ఇంటి యజమానులకు తెలిపింది. వారు బంధువు అయిన నీలకంఠకు సమాచారం ఇవ్వగా, ఆయన ఇంటికి వెళ్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆదివారం బాధితుల ఫిర్యాదు మేరకు బీరువా తాళాలు పగలగొట్టి బంగారు నక్లెస్, ఒక లాంగ్ చైన్, రెండు ఉంగరాలు, మొత్తం మూడు తులాల బంగారు దొంగలించినట్లు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ఘనంగా రాఘవేంద్ర స్వామి రథోత్సవం



రథాన్ని అలంకరిస్తున్న భక్తులు

కోసిగి, మార్చి 2(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని అగసనూరు గ్రామంలో తుంగభద్ర నది ఒడ్డున వెలసిన జగద్గురు గురు రాఘవేంద్రస్వామి రథోత్సవం ఆదివారం సాయంత్రం భక్తుల మధ్య ఘనంగా నిర్వహించారు. గురు రాఘవేంద్రస్వామి సప్తవారోత్సవాల్లో భాగంగా ఉత్తరాధన పురస్కరించుకుని రాఘవేంద్రస్వామికి పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు వెంకటేశులు ఆధ్వర్యంలో స్వామివారికి సుప్రభాత సేవ, ఉత్సవాలకు అంకురార్పణ చేశారు. అనంతరం ఉత్సవ మూర్తి ప్రహ్లాదరాయల పల్లకోత్సవం అనంతరం స్వామివారికి పల్లకిని తుంగభద్ర నది వరకు మంగళవాయిద్యాల మధ్య ఊరేగింపు తీసుకెళ్లారు. అనంతరం రాఘవేంద్రస్వామి మహారథోత్సవం భక్తుల మధ్య ముందుకు సాగింది. అగసనూరు గ్రామంతో పాటు సాతనూరు, జూకూరు, మూగలదొడ్డి, కందుకూరు గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

యువకుడి అనుమానాస్పద మృతి

● అన్నతో కలిసి బెంగళూరులో వ్యాపారం చేస్తున్న అజయ్



దేవనకొండ, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బండపల్లి గ్రామానికి చెందిన అజయ్ (18) బెంగళూరులో అనుమానాస్పదంగా మృతిచెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన మేరకు.. గ్రామానికి చెందిన వడ్డె నరసింహులు, అనురాధకు రెండో కుమారుడు అజయ్ బెంగుళూరులో అన్న వద్ద ఉంటూ ముగ్గుపొడి వ్యాపారం చేస్తూ, డ్యాన్స్ నేర్చుకునేవాడు. శనివారం అన్న మహేష్ యథావిధిగా వ్యాపారానికి వెళ్లాడు. సాయంత్రం ఇంటికి రాగా తాళం వేసి ఉంది. ఫోన్ చేసినా స్పందించకపోవడంతో తాళం పగలకొట్టి చుడగా అజయ్ ఉరి వేసుకుని విగతజీవిగా మారాడు. అయితే తన తమ్ముడు ఉరేసుకుంటే బయట తాళం ఎలా వేశాడని అన్న మహేష్ అనుమానం వ్యక్తం చేశాడు. మృతుడి అన్న ఫిర్యాదు బెంగుళరులోని చామండినగర్ ఈరన్నగుట్ట పోలీసు స్టేషన్లో కేసు నమోదైంది.

బాబోయ్ దోమలు

● అనారోగ్యానికి గురవుతున్న గ్రామీణులు

ఎమ్మిగనూరు రూరల్, మార్చి 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆయా గ్రామాల ప్రజలు దోమల కాటుకు గురవుతున్నారు. మండలంలోని సిరాలదొడ్డి, కడివెళ్ల, కందనాతి, మసీదుపురం, మాస్‌మాన్‌దొడ్డి, గుడికల్లు, కె. తిమ్మాపురం, దైవందిన్నె, ఏనుగుబాల తదితర గ్రామాల్లో దోమల కాటుతో ప్రజలు అనారోగ్యాలకు గురవుతున్నారు. ఆయా గ్రామాల్లో పంచాయతీ అధికారులు మురుగు కాలువలను శుభ్రం చేయకపోవడంతో దోమలు ప్రబలుతున్నట్లు స్థానికులు ఆరోపించారు. దాంతో పలు విషజ్వరాల బారిన పడుతున్నామని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజలు అనారోగ్యాలకు గురవుతున్నా పంచాయతీ అధికారులు మాత్రం ఏ మాత్రం పట్టించుకోకపోవడం దారుణమని ఆయా గ్రామాల ప్రజలు అధికారుల తీరుపై మండిపడుతున్నారు. అధికారులు స్పందించి ఆయా గ్రామాల్లోని మురుగు కాలువలను శుభ్రంచేసి దోమల మందును పిచికారి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

రైతులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలి



నలకదొడ్డిలో రైతు సభ్యత్వం చేయిస్తున్న నాయకులు

పత్తికొండ టౌన్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): రైతులకు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గిడ్డయ్య డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలోని నలకదొడ్డి గ్రామంలో రైతు సంఘం సభ్యత్వ నమోదును ప్రారంభించారు. రైతులు ఏటా అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. పంటలకు మద్దతు ధర లేదని, అతివృష్టి, అనావృష్టిలతో రైతులు ఏటేటా ఆర్థికంగా చితికిపోయి ఆత్మహత్యలకు పాల్పడుతున్నారన్నారు. అన్నదాత సుఖీభవ పథకాన్ని అమలు చేసి రైతులకు మద్దతు ధర కల్పించాలని, పంటల బీమాను వర్తింపజేయాలని కోరారు. రాజాసాహెబ్, తిమ్మయ్య, సురేంద్ర కుమార్ ఉన్నారు.

పీఆర్సీ కమిటీని నియమించాలి



మాట్లాడుతున్న ఎస్టీయూ కార్యదర్శి గోపాల్

ఆదోని అగ్రికల్చర్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): 12వ పీఆర్సీ కమిటిని వెంటనే నియమించాలని ఎస్టీయూ కార్యదర్శి గోపాల్ డిమాండ్ చేశారు. ఆదివారం ప్రాంతీయ కార్యాలయంలో ఆదోని కౌతాళం మండల శాఖల ముఖ్యనా యకుల సమావేశం మండల కార్యదర్శి సుధాకర్ బాబు అధ్యక్షతన నిర్వహించారు. 11వ పీఆర్సీ ముగిసి 20 నెలలు గడిచినా ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణితో వ్యవహ రిస్తోందని ఆవేదనవ వ్యక్తం చేశారు. 30 శాతం ఐఆర్‌ను ప్రకటిం చాలని కోరారు. చింతకుంట రామకృష్ణ, అంజయ్య, భాస్కర్ పాల్గొన్నారు.

మెడికల్ రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి

ఆదోని అగ్రికల్చర్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగ ఉపాధ్యాయుల మెడికల్ రీయింబర్స్‌మెంట్‌ను వెంటనే విడుదల చేయాలని ఏపీటీఎఫ్ మండల అధ్యక్షుడు ముత్తన్న డిమాండ్ చేశారు. ఆదివారం ప్రాంతీయ కార్యాలయంలో ముఖ్యనాయకుల సమావేశం నిర్వహించారు. ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందన్నారు. ప్రావిడెంట్ ఫండ్ రుణాలు, ఈఎల్ఎస్‌లను చెల్లించాలన్నారు. బడ్జెట్‌లో ఉద్యోగ ఉపాధ్యాయులకు కేటాయింపులు లేకపోవడం నిరాశపరిచిందన్నారు. రామునాయక్, జయరాముడు పాల్గొన్నారు.

మహిళ ఆత్మహత్యపై విచారణ



నందవరంలో విచారిస్తున్న డీఎస్పీ

నందవరం, మార్చి 2(ఆంధ్రజ్యోతి): వేధింపులు తాళలేక మండల కేంద్రంలో శనివారం ఆశీర్వాదమ్మ అనే మహిళ ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన స్థలాన్ని ఆదివారం డీఎస్పీ ఉపేంద్రబాబు పరిశీలించారు. ఆత్మహత్య ఎలా చేసుకుందనే వివరాలు అడిగి తెలుసుకున్నారు. అలాగే మృతురాలి తల్లిదండ్రులతో ప్రత్యేకంగా మాట్లాడారు. వారి వివరాలు సేకరించారు. ఇది ఆత్మహత్య లేక హత్య అన్న కోణంలో విచారణ జరిపారు. డీఎస్పీ వెంట ఎస్ఐ శ్రీనివాసులు, పోలీసులు పాల్గొన్నారు.